నేటి కందం- నేటికి అందం

నెచ్చెలి యగుచు ప్రభుత్వము
పెచ్చుగ వయసున్నయట్టి వృద్ధులు గోరన్
తచ్చాడ కుండ-తీసుక
వచ్చిన దీనాడు గృహము వద్దకు ఓటింగ్ !!

(85 సంవత్సరాలు,ఆపై వయస్సున్న ఓటర్ల సౌకర్యార్థం, దివ్యాంగుల సౌలభ్యం కోసం ప్రభుత్వం "ఇంటి వద్దకు ఓటింగ్" (హోమ్ ఓటింగ్) ఏర్పాటు చేసింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

కులరహిత సమాజం
కోరుకునే గొప్పోళ్లు
తగిలిస్తరు పేరు పక్క
తోక ఇంకా ఎన్నాళ్ళు
ఆచరంచకుండా ఎలా
ఆదర్శం వల్లిస్తరు
పేరుకొరకే వివక్షల
ప్రభావాన్ని మల్లిస్తరు

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 14-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:191 పేజీలు:6 వెల: రూ.1/-

## మహిళా కోటా బిల్లుపై 16 నుంచి పార్లమెంట్‌లో చర్చిస్తాం: ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13: ఎట్టి పరిస్థితుల్లోనూ మహిళా సాధికారత చట్టాన్ని 2029 నాటి వరకు అమలు చేయాలని డిమాండ్లు వస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. 2029 డెడ్‌లైన్‌ను దృష్టిలో పెట్టుకున్నామని, దీనిలో భాగంగానే ఏప్రిల్ 16వ తేదీ నుంచి మహిళా సాధికారత చట్టం గురించి పార్లమెంట్‌లో చర్చించనున్నట్లు ఆయన చెప్పారు. ఢిల్లీలో జరుగుతున్న నారీ శక్తి వందన సమ్మేళనం కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరి కృషిని దృష్టిలో పెట్టుకుని మహిళా సాధికార బిల్లుకు ఆమోదం జరిగేలా చూడాలన్నారు. దేశంలోని ప్రతి మహిళ సంతోషపడుతుందని, ప్రతి మహిళకు లబ్ధి చేకూరుతుందన్నారు.

నారీ శక్తి వందన్ అభినియం యాక్ట్ రూపకల్పన 21వ శతాబ్దంలోనే అత్యంత కీలకమైన అంశమన్నారు. కొత్త చరిత్ర సృష్టించేందుకు పార్లమెంట్ వేదిక కానున్నదని, గత విజన్‌ను దృష్టిలో పెట్టుకుని, భవిష్యత్తు ఆశయాలను తీర్చనున్నట్లు ఆయన చెప్పారు. మన దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థలన్నీ మహిళల నాయకత్వానికి అసాధారణ వేదికలయ్యాయన్నారు. ప్రసంగాలతో చైతన్యపరచడానికి ఇక్కడకు రాలేదని, ఈ దేశ మహిళల ఆశీర్వాదం తీసుకునేందుకు ఇక్కడకు వచ్చినట్లు ప్రధాని చెప్పారు. భారతీయ మహిళలు ఈ దేశానికి ఎంతో మేలు చేశారన్నారు. ప్రజాస్వామ్య విధానంలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని కొన్ని దశాబ్దాలుగా అందరూ అనుకున్నారని, 2023లో నారీశక్తి వందన్ అభినియం బిల్లును అన్ని పార్టీలు ఏకపక్షంగా ఆమోదించాయన్నారు.

2029 నాటికి మహిళా కోటా బిల్లును అమలు చేయాలన్న అభిప్రాయాన్ని ప్రతిపక్షంగా గట్టిగా గతంలో వ్యక్తం చేసిందని, అయితే ఆ బిల్లుపై సుదీర్ఘమైన రీతిలో చర్చలు జరగాలని, సహకారం, భాగస్వామ్యం కూడా ఉండాలని ప్రధాని మోదీ తెలిపారు. నిర్ణయాత్మక అంశాల్లో మహిళ భాగస్వామ్యం పెరిగితే, వ్యవస్థలో మార్పు వేగంగా ఉంటుందని అధ్యయనాలు వెల్లడించినట్లు ఆయన పేర్కొన్నారు. జల జీవన్ మిషన్‌లో మహిళల పాత్ర ప్రశంసనీయమన్నారు.

## హోర్ముజ్ జలసంధి దిగ్బంధనం.. అమెరికాకు నాటో దేశాల షాక్..



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:అమెరికా-ఇరాన్ యుద్ధం కీలక దశలోకి చేరిన సమయంలో అగ్రరాజ్యానికి నాటో మిత్ర దేశాలు షాక్ ఇచ్చాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన హోర్ముజ్ దిగ్బంధనానికి నాటో మిత్రదేశాలు మద్దతు ఇవ్వడానికి నిరాకరించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశాయి. ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు ఫలించకపోవడంతో, హోర్ముజ్‌లో రవాణాను పూర్తిగా నిరోధించడానికి అమెరికా సైన్యం ఇతర దేశాలతో కలిసి పనిచేస్తుందని ట్రంప్ అన్నారు

నాటోలోని కీలకమైన బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు హోర్ముజ్ దిగ్బంధనంలో పాల్గొనబోమని ప్రకటించాయి. తమ ప్రాధాన్యం హోర్ముజ్ తెరిచి ఉండడమేనని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తేల్చి చెప్పారు. ప్రపంచ చమురులో దాదాపు 20% హోర్ముజ్ మార్గం ద్వారా సరఫరా అవుతుంది. ఈ మార్గం పూర్తిగా మూసివేస్తే ఇంధన సంక్షోభం మరింత పెరుగుతుంది. అందుకే యూరప్ దేశాలు దిగ్బంధనం కంటే స్వేచ్ఛా రవాణాకే ప్రాధాన్యం ఇస్తున్నాయి

ఇరాన్ పోర్టులకు వెళ్లే నౌకలను అడ్డుకోవాలని, ఆ దేశ ఆయిల్ ఎగుమతులను పూర్తిగా నిలిపివేయాలనేది ట్రంప్ ప్లాన్ ఈ దిగ్బంధనం యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తుందనడంలో సందేహం లేదు. అందుకే నాటో దేశాలు ఈ ప్రణాళికకు దూరంగా ఉన్నాయి. నాటో దేశాలు మద్దతు ఇవ్వకపోవడంతో అమెరికా ఒంటరిగానే ముందుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఈ నిర్ణయం అమెరికా- ఇతర నాటో దేశాల మధ్య విభేదాలను మరింత పెంచే అవకాశం కనిపిస్తోంది.

## ఈ నెల 22 నుంచి ఆర్టీసీ సమ్మె సైరన్.. !

హైదరాబాద్, ఏప్రిల్ 13: లేబర్ కమిషన్ సమ్మె చర్చలకు ఆర్టీసీ యాజమాన్యం మరోసారి దుమ్మా కొట్టింది. ఈ నేపథ్యంలో ఇకపై తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చుకోవడం కోసం సమ్మె సైరన్ మోగించారు. ఈ నెల 22 నుంచి తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టనున్నారు. ఆర్టీసీ కార్మికులు కొంతకాలంగా వేతనాలు, బెనిఫిట్స్, సర్వీస్ సమస్యలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచేందుకు సమ్మె చేపట్టేందుకు రెడీ అవుతున్నారు. మార్చి 13న ఇప్పటికే ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటీసులు ఇవ్వగా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తాజాగా ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు రాకపోవడంతో సమ్మె చేయాలని నిర్ణయం కార్మికులు తీసుకున్నారు.

## సమ్మెపై ఆలోచించండి.. తొందరపడొద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 13: తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందరపడవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.

సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు.. ఈరోజు సాయంత్రం 4 గంటలకు లేబర్ కమిషనర్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు.

లేబర్ కమిషనర్ కార్యాలయం వద్దకు భారీగా ఆర్టీసీ కార్మికులు చేరుకోవాలని జేఏసీ పిలుపునిచ్చింది. చర్చల అనంతరం సమ్మె తేదీ ప్రకటించే అవకాశం ఉంది . ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెకు వెళ్లాలని ఆర్టీసీ కార్మికులు యోచిస్తున్నట్లు సమాచారం. మార్చి 13న యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

### -తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 13:డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు.

**దుష్ప్రచారం జరుగుతోంది**

మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

**రెండూ వేర్వేరు**

మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు

మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## హోర్ముజ్ జలసంధిపై ట్రంప్ హెచ్చరికలతో గ్లోబల్ ట్రేడ్‌పై చైనా ఆందోళన




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13: ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి కేంద్రంగా అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ జలసంధిపై నౌకాదళ దిగ్బంధనాన్ని ప్రకటిస్తామని హెచ్చరించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. దీనిపై చైనా తీవ్రంగా స్పందిస్తూ, అంతర్జాతీయ వాణిజ్యానికి ఆటంకం కలగకుండా అడ్డంకులు లేని మార్గాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చింది.

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలు విఫలం కావడంతో, ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ కఠిన నిర్ణయాల వైపు అడుగులు వేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ ఓడరేవులకు వెళ్లే లేదా అక్కడి నుంచి వచ్చే నౌకలను అడ్డుకుంటామని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఇరాన్ అంతర్జాతీయ చమురు సరఫరాను అడ్డుకుంటూ ప్రపంచాన్ని బెదిరిస్తోందని ట్రంప్ ఆరోపిస్తున్నారు. అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ఇరాన్ తీర ప్రాంతాల్లో దిగ్బంధనాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ బీజింగ్‌లో జరిగిన సమావేశంలో ఈ విషయంపై స్పందించారు. హోర్ముజ్ జలసంధి కేవలం ఒక ప్రాంతానికి సంబంధించినది కాదని, ఇది ప్రపంచ వాణిజ్యం, ఇంధన భద్రతకు వెన్నెముక అని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు తగ్గించి, అన్ని పక్షాలు శాంతియుతంగా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో దాదాపు ఐదింట ఒకవంతు ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఒకవేళ ఇక్కడ దిగ్బంధనం జరిగితే చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయని, ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని చైనా హెచ్చరించింది. మరోవైపు, చైనా.. ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో, ట్రంప్.. చైనాపై 50 శాతం టారిఫ్‌లు విధిస్తామని బెదిరించారు. అదే సమయంలో, ఇరాన్ నుంచి చమురు కొనడం మానేస్తే, అమెరికా లేదా వెనిజులా నుంచి తక్కువ ధరకు చమురు సరఫరా చేస్తామని కూడా ట్రంప్ ఒక ఆఫర్ ఇచ్చారు.

ప్రస్తుతం హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి వల్ల గ్లోబల్ మార్కెట్లు ఒడుదుడుకులకు లోనవుతున్నాయి. చైనా ఈ విషయంలో తలదూర్చడం వల్ల, రానున్న రోజుల్లో అమెరికా తన దిగ్బంధన నిర్ణయాన్ని ఎంతవరకు అమలు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఏ పార్టీతో పొత్తు పెట్టుకోం: టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు



నిర్మల్, ఏప్రిల్ 13: పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని.. పార్టీ స్థాయిలో కాదని వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజం చేసినా ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ అధికారబలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు.

తలసరి ఆదాయం ఉంటేనే అసెంబ్లీ సీట్లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాంచందర్ రావు విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పేదవారిని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయాలనే ఉద్దేశంతో చేసినట్లుగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మహిళల హక్కుల గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

వికసిత్ భారత్ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు వెల్లడించారు.

## 50 శాతం సీట్ల పెంపుతో దక్షిణాదికి నష్టమేంటి?: బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 13:లోక్‌సభ సీట్లను రాష్ట్రాల వారీగా 50 శాతం పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టమేమిటని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రజల్లో లేనిపోని భయాలను సృష్టిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై నిజాలను చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూడకూడదని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం అవసరమని అన్నారు. విభజన అనే అంశం కాంగ్రెస్ పార్టీ స్వభావంలోనే ఉందని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మనుషులతో కాకుండా డబ్బుతోనే సంబంధాలు ఉంటాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి, మీరు కూడా మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్, రేవంత్ మధ్య తేడా ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా అర్థమైందని వ్యాఖ్యానించారు.

## మహిళా రిజర్వేషన్లపై అవగాహన లోపంతో మాట్లాడుతున్నారు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 13: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఎక్స్ పోస్టుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. మహిళా రిజర్వేషన్లపైన సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని తెలిపారు. 15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చలో అందరు ఎంపీలు మాట్లాడవచ్చని వెల్లడించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్‌ని కోరారు.

**మహిళల రిజర్వేషన్ల గురించి కాంగ్రెస్ ఎందుకు పట్టించుకోలేదు..**

దశాబ్దాలుగా కాంగ్రెస్ పరిపాలన చేసిందని.. అంబేద్కర్ చెప్పిన మహిళల రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని.. వారికి హక్కులు కల్పించాలని రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని చెప్పారు. తాము దక్షిణాదిలోనే ఉన్నామని.. ఎవరికీ అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

డీలిమిటేషన్ చేయాల్సిందే..

మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి సెన్సెస్ రావాలంటే రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. మిడి మిడి జ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఇరాన్ పూర్తిగా శాంతి చర్చలకు కట్టుబడి ఉందని, అలాగే సైనిక చర్యలకు కూడా సిద్ధంగానే ఉంది-ఇరాన్ రాయబారి




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13: ఇస్లామాబాద్‌లో అమెరికాతో జరిగిన శాంతి చర్చలు విఫలమైనప్పటికీ, తమ డిమాండ్లను అంగీకరిస్తే మరోసారి చర్చలకు సిద్ధమేనని భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాల గురించి అమెరికా ఇప్పుడు ఓ అవగాహనకు వచ్చి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఇరాన్ తన శక్తిని నిరూపించిందని అన్నారు

హోర్ముజ్ జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే ఉందని, దానిని కాపాడుకోవడానికి తమకున్న హక్కులను వినియోగించుకుంటామని ఫతాలీ అన్నారు. ఇరాన్ పూర్తిగా శాంతి చర్చలకు కట్టుబడి ఉందని, అలాగే సైనిక చర్యలకు కూడా సిద్ధంగానే ఉందని పేర్కొన్నారు. టెహ్రాన్ శక్తి ఏమిటో అమెరికాకు తెలుసని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు, జాతీయ ప్రయోజనాల కోసమే ఇస్లామాబాద్‌లో తమ ప్రతినిధి బృందం 21 గంటల పాటు అమెరికా బృందంతో చర్చలు జరిపిందన్నారు

అణు సమస్యలు, యుద్ధ నష్టపరిహారం, ఆంక్షల ఉపశమనం వంటి మూడు డిమాండ్లను తమ బృందం అమెరికా ముందు ఉంచిందని వాటిని అగ్రరాజ్యం అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయని ఫతాలీ తెలిపారు. తమ దేశంపై అమెరికా-ఇజ్రాయెల్ చేసిన దాడుల వల్ల 3375 మంది పౌరులు మరణించారని, భారీగా ఆస్తి నష్టం కూడా సంభవించిందని పేర్కొన్నారు.

# స్వతంత్ర భారత చరిత్రలో చెరగని సంతకం డా: బి ఆర్ అంబేద్కర్

## (14 ఏప్రిల్ "డా: బి ఆర్ అంబేద్కర్ జయంతి" సందర్భముగా)

1928లో సాధారణంగా ప్రారంభమైన డా: భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ జయంతిని నేడు దేశ విదేశీ స్థాయిలో "భీమ్ జయంతి" లేదా "సమానత్వ దినం" పేరుతో కూడా భారీ స్థాయిలో నిర్వహించడం సముచితంగా ఉన్నది. 14 ఏప్రిల్ 1891 రోజున మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇండోర్ సమీప మోహ్ గ్రామంలోని దళిత కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ స్వతంత్ర భారత చరిత్రలో చెరగని సంతకం చేసే స్థాయికి ఎదిగారు. చిన్నతనం నుంచే పాఠశాలలో కుల వివక్ష ఎదుర్కొంటూనే అత్యంత చురుకైన విద్యార్థిగా ఎదుగుతూ, ముంబాయి ఎల్ఫిన్‌స్టన్ కాలేజీలో చదివి, అమెరికన్ కొలంబియా విశ్వవిద్యాలయం, యూకె లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో రెండు డాక్టరేట్లు పొందిన తొలి దళిత భారతీయుడిగా కీర్తి గడించారు.

భారత రాజ్యాంగ పితామహుడు:

భారత రాజ్యాంగ రచన కమిటీకి చైర్మన్‌గా అందించిన విశిష్ట సేవలతో పాటు జూరిస్టుగా, రచయితగా, రాజకీయ నాయకుడిగా, ఎకానమిస్ట్‌గా, సామాజిక కార్యకర్తగా, ముంబాయి లా కళాశాల ప్రిన్సిపల్‌గా, ప్రొఫెసర్‌గా డా: భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ చేసిన కృషి అనన్యసామాన్యం, అభినందనీయం. స్వతంత్ర భారత తొలి కెబినెట్‌లో న్యాయ శాఖమంత్రిగా తన ముద్రను పరిచయం చేసిన అంబేద్కర్ సామాజిక సేవకుడిగా కుల వివక్ష, అంటరానితనం, దళిత అణగారిన వర్గాల మహిళలకు విద్య ద్వారా సాధికారత సాధన, సామాజిక సమానత్వ సాధన, మానవ హక్కుల పరిరక్షణ లాంటి పలు ఉద్యమాలను ముందుండి నడిపారు. 29 ఆగష్టు 1947న భారత రాజ్యాంగ రచన కమిటీకి చైర్మన్‌గా నియమింపబడిన అంబేద్కర్ రాజ్యాంగ రచన పూర్తి చేసి 26 నవంబర్ 1949న నాటి రాజ్యాంగ అసెంబ్లీ అంగీకారం తెలపడం, అది 26 జనవరి 1950 నుంచి అమలులోకి రావడం మనకు తెలుసు. 1990లో మరణానంతరం భారత రత్న పురస్కారం పొందిన అంబేద్కర్ మేధో సంపత్తి అపారం.

అసాధారణ సామాజిక కార్యకర్త అంబేద్కర్:

భీమ్ జయంతి శుభ గడియల్లో అంబేద్కర్ చేసిన సామాజిక విలక్షణ కృషికి ప్రతిరూపంగా సామాజిక సమన్యాయం, పౌర స్వేచ్ఛ పరిరక్షణ, సోదరభావం, మానవ హక్కుల సంరక్షణ లాంటి అంశాలను సుసాధ్యం చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసి "బాబాసాహెబ్" అంటూ గౌరవంగా పిలువబడ్డారు బ్రాహ్మణ సమాజానికి వ్యతిరేకంగా సమానత్వ సాధనలో భాగంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేయడానికి "బహిష్కృత్ హితకరిని సభ" అనే కులరహిత సమాజ స్థాపన ఉద్యమానికి నాయకత్వం వహించారు. దేవాలయాల్లో ప్రవేశాల నిషేధాలు, పూజారుల ప్రవర్తనకు వ్యతిరేకంగా గళం విప్పడం, కుల వ్యవస్థను ఎదిరిస్తూ మానవ హక్కుల స్థాపనకు ఎనలేని కృషి చేశారు. మేధావిగా పలు గ్రంథాలను రచించిన అంబేద్కర్ చొరవతో పని గంటలను 12 నుంచి 8 గంటలకు కుదించడం, ఆర్‌బిఐ స్థాపనకు పునాదులు వేయగలిగారు.

అంబేద్కర్ రచించిన ఆత్మకథను తన పూర్వ సంస్థ కొలంబియా విశ్వవిద్యాలయం పాఠ్యాంశంగా కూడా తీసుకోవడం తన స్థాయిని రుజువు చేస్తున్నది. ప్రఖ్యాత లండన్ మ్యూజియంలో కార్ల్ మార్క్స్ విగ్రహ సమీపాన అంబేద్కర్ విగ్రహం కూడా ఏర్పాటు చేయడం ఆయన చేసిన అపార కృషికి తార్కాణం. కుల వివక్ష కోరలు చాచిన కాలంలో క్షణ క్షణం వివక్షను ఎదుర్కొంటూనే, చదువుపై ఏకాగ్రత పెట్టి ఆర్థికశాస్త్రంలో అత్యున్నత స్థాయి విద్యను అర్జించి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని గడించిన అంబేద్కర్ జీవితం ప్రపంచ యువతకు నిత్యం దారి దీపంగా నిలుస్తున్నది, పేద యువతకు ప్రేరణను నింపుతున్నది.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
సెల్:9949700037

# పటాన్ చెరులో వైభవంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం .. భారీ ర్యాలీతో ఆకట్టుకున్న కార్యక్రమం



సంగారెడ్డి, ఏప్రిల్ 13: (నేటినిజం ప్రతినిధి): పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ కు పటాన్ చెరు బస్టాండ్ చౌరస్తా వద్ద ఘన స్వాగతం లభించింది. నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో భారీగా చేరుకున్న కార్యకర్తలు ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు.

ముందుగా భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించిన అనంతరం, వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి మంత్రి చేరుకున్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గజమాలలు వేసి, బాణాసంచా కాల్చి ఉత్సాహభరిత స్వాగతం పలికారు. మంత్రి కార్యకర్తలకు అభివాదం చేస్తూ వారికి మరింత ఉత్సాహాన్ని నింపారు.

పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యేపూరి శివానందం, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్ మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం నూతన పాలక వర్గానికి ఘన సన్మానం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్ర కాలం లోనే పటాన్ చెరు అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాటా శ్రీనివాస్ గౌడ్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని పేర్కొన్నారు.

అందరూ కలిసి పనిచేస్తే పటాన్ చెరు భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందని, రాబోయే కాలంలో కాటా శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్యేగా అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. రైతు సంక్షేమం, విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సంగారెడ్డి జిల్లాకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, భారతీయ సాంకేతిక విద్యాసంస్థ హైదరాబాద్ వంటి సంస్థలను తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఇందిరమ్మ మెదక్ ఎంపీగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగిందన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామన్వెల్త్ క్రీడల అధ్యక్షుడు డాక్టర్ డొనాల్డ్ రుకారేతో కేంద్ర క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ సమావేశం ప్రతిష్ఠాత్మక 2030 కామన్వెల్త్ గేమ్స్ కోసం భారత్ సన్నద్ధతపై చర్చ



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, ఈరోజు కామన్వెల్త్ క్రీడల సీనియర్ నాయకులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. 2030లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, క్రీడాకారులే కేంద్రంగా స్థిరమైన కామన్వెల్త్ క్రీడలను నిర్వహించాలనే భారత్ నిబద్ధతను ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

కామన్వెల్త్ గేమ్స్ (సీడబ్ల్యూజీ) -,2030 నిర్వహణకు ఆతిథ్య దేశంగా భారత్ ను ఎంపిక చేసినందుకు, డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కామన్వెల్త్ స్పోర్ట్ ప్రతినిధి బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు.

"ఈ క్రీడలను విజయ వంతంగా నిర్వహించడానికి దేశంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. భారతదేశం తన రంగుల మయమైన, సాంస్కృతిక వైవిధ్యంతో క్రీడా ప్రపంచాన్ని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉంది. కామన్వెల్త్ క్రీడల శతాబ్ది వేడుకలు చిర స్మరణీయమైన క్షణంగా నిలుస్తాయి" అని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు.

ఖేలో ఇండియా క్రీడల విస్తరణ గురించి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కామన్వెల్త్ స్పోర్ట్ ప్రతినిధి బృందానికి వివరించారు. ఖేలో ఇండియా కింద నిర్వహిస్తున్న వివిధ రకాల క్రీడలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న అస్మిత లీగ్స్, తొలిసారిగా ప్రారంభించిన ఖేలో ఇండియా గిరిజన క్రీడల గురించి ఆయన వివరించారు.

యువత, క్రీడాకారుల ద్వారా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో కామన్వెల్త్ గేమ్స్ పట్ల కల్పిస్తున్న అవగాహన, అలాగే ఈ క్రీడల సందేశాన్ని భారత ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎలా తీసుకెళ్తోందో కూడా డాక్టర్ మాండవీయ ప్రస్తావించారు.

డొనాల్డ్ రుకారే నాయకత్వంలోని కామన్వెల్త్ స్పోర్ట్ ప్రతినిధి బృందం, జాతీయ అభివృద్ధి ఎజెండాలో క్రీడలను ఒక ముఖ్యమైన మైలురాయిగా మార్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభినందించింది.

డొనాల్డ్ రుకారే నాయకత్వంలోని ఈ కామన్వెల్త్ స్పోర్ట్ ప్రతినిధి బృందంలో సీఈఓ కేటీ సాడ్లీర్, గేమ్స్ అండ్ అస్యూరెన్స్ డైరెక్టర్ డారెన్ హాల్, స్పోర్ట్ డైరెక్టర్ ఆన్-లూయిస్ మోర్గాన్, మేజర్ ఈవెంట్స్ నిపుణుడు నీల్ కార్నీలు ఉన్నారు.

క్రీడల సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైన సన్నాహక చర్యలు, సమన్వయ యంత్రాంగాలు, కాలపరిమితులపై సమావేశం ప్రధానంగా దృష్టి సారించింది. రెండు పక్షాలు భవిష్యత్తు కార్యాచరణ, కీలకమైన మైలురాళ్లపై ఏకాభిప్రాయంతో కూడిన అవగాహనకు వచ్చాయి.

భారతదేశం తన 2030 కామన్వెల్త్ గేమ్స్ దార్శనికతను మూడు ప్రధాన అంశాలతో ప్రదర్శించింది. క్రీడాకారులే కేంద్రంగా ప్రపంచ స్థాయి పోటీని, క్రీడాకారుల సంక్షేమాన్ని నిర్ధారించడం, దీర్ఘకాలిక ప్రభావంపై దృష్టి సారించి పర్యావరణానికి అనుకూలమైన పద్ధతులను అనుసరించడం, క్రీడల సమర్థవంతమైన నిర్వహణ కోసం ఆధునిక, సాంకేతిక వ్యవస్థలను వినియోగించుకోవడం ఇందులో ఉన్నాయి.

2030 కామన్వెల్త్ క్రీడల నిర్వహణకు అహ్మదాబాద్‌లోని బలమైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, సంస్థాగత మద్దతు కీలక బలాలని సమావేశంలో డాక్టర్ మాండవీయ వివరించారు.

దేశవ్యాప్తంగా శాశ్వత క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, అట్టడుగు స్థాయి నుంచి భాగస్వామ్యాన్ని పెంచడం వంటి పటిష్ట ప్రణాళికపై భారత్ బలమైన దృష్టిని కూడా డాక్టర్ మాండవీయ వివరించారు.

# వందే భారత్ రైళ్లకు పెరుగుతున్న ప్రజాదరణ... సత్వర... సౌలభ్య .. ఆధునిక రైలు ప్రయాణ నవ శకానికి ఇనుమడిస్తున్న డిమాండ్



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:వందే భారత్ ఎక్స్ ప్రెస్ నెట్‌వర్క్‌కు భారత రైల్వే ప్రయాణికుల ఆదరణ గణనీయంగా పెరిగింది. ఈ మేరకు 2024-25లో 2.97 కోట్ల మంది ఈ రైళ్ల ద్వారా ప్రయాణించగా, 2025-26లో సుమారు 3.98 కోట్ల మంది ప్రయాణించారు. తద్వారా దాదాపు 34 శాతం బలమైన వార్షిక వృద్ధి నమోదైంది. దేశవ్యాప్తంగా వేగవంతమైన, సౌకర్యవంతమైన, ఆధునిక రైలు ప్రయాణానికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రజాదరణలో గణనీయ పెరుగుదల స్పష్టం చేస్తుంది. వాస్తవానికి వందే భారత్ ఎక్స్ ప్రెస్ ఆరంభం నుంచి లక్ష ట్రిప్పుల ద్వారా 9.1 కోట్ల మందికి పైగా ప్రయాణికులకు సేవలందించింది. ప్రజల విస్తృత విశ్వాసాన్ని, ఈ రైళ్లకు పెరుగుతున్న నిరంతర డిమాండ్‌ను ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది.

తొలి దేశీయ రూప కల్పన-తయారీ ద్వార ఈ సెమీ హైస్పీడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ భారత రైల్వే ప్రయాణాన్ని పునర్నిర్వచిస్తోంది.

దేశంలో తొలుత 2019 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ-వారణాసి మార్గంలో ఈ రైలు ప్రారంభం కాగా, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం వేగం, సౌకర్యం, స్వావలంబనకు ప్రతీకగా నిలిచి దేశవ్యాప్త నెట్‌వర్క్‌గా ఇది రూపొందింది.

న్యూఢిల్లీ-వారణాసి మార్గం నేడు అత్యంత రద్దీగా ఉండటంతో ఇప్పటిదాకా 73 లక్షల మందికిపైగా ప్రయాణించారు. న్యూఢిల్లీ శ్రీ మాతా వైష్ణో దేవి-కట్రా మార్గంలో సుమారు 56 లక్షల మంది ప్రయాణించారు.

పుణ్యక్షేత్ర యాత్రలలో ఈ రైలు తన ప్రాధాన్యాన్ని చాటి చెబుతోంది. దక్షిణ భారతదేశంలోని సికింద్రాబాద్?విశాఖపట్నం మార్గంలో 48 లక్షల మందికి పైగా ప్రయాణికులకు ఈ రైలు సేవలందించింది.

మరోవైపు డాక్టర్ ఎంజీఆర్ సెంట్రల్ (చెన్నై)-మైసూరు మార్గంలో36 లక్షల మందికిపైగా ప్రయాణించారు. ఈ రైళ్ల నెట్‌వర్క్‌లో రద్దీ బలమైన ప్రాంతీయ డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. ఈ సేవలు పర్యాటక రంగానికి కీలక సాధనాలుగా మారాయి. కీలక మత, సాంస్కృతిక, తీరప్రాంత గమ్యాలకు ప్రయాణాన్ని మెరుగుపరుస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థలను ప్రోత్సహించడంతో పాటు సందర్శకుల రాకపోకలను ఈ నెట్‌వర్క్ ఇనుమడింపజేస్తోంది.

సుదూర ప్రయాణ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తూ భారతీయ రైల్వే 2026 జనవరిలో వందే భారత్ స్లీపర్ సర్వీసును ప్రవేశపెట్టింది. ఇది ప్రారంభమైన తొలి మూడు నెలల్లోనే, దీని ద్వారా 119 ట్రిప్పులలో 1.21 లక్షల మంది ప్రయాణికులను చేరవేసింది. అంటే- 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీ సాధించింది. రాత్రి వేళ ప్రీమియం ప్రయాణానికిగల బలమైన డిమాండ్‌ను, ప్రయాణికుల విశ్వాసం పెరగడాన్ని ఇది సూచిస్తుంది.

ఆవిష్కరణలు, ప్రయాణిక-కేంద్రక సేవలు, స్వదేశీ తయారీ వగైరాలపై భారతీయ రైల్వే నిబద్ధతకు వందే భారత్ ఎక్స్ ప్రెస్ ఒక నిదర్శనంగా నిలుస్తోంది. మెట్రో నగరాలు, పుణ్యక్షేత్రాలు, వారసత్వ నగరాలు, వర్ధమాన ఆర్థిక కేంద్రాలను జోడిస్తూ నిరంతర విస్తరణ సహా స్లీపర్ రకాన్ని కూడా ప్రవేశపెట్టడం ద్వారా వేగవంతం, సురక్షితం, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తూ భారతీయ రైల్వే ముందడుగు వేస్తోంది. మొత్తం మీద భారత్ ఎక్స్‌ప్రెస్ దేశంలోనే ఆధునిక రైలు ప్రయాణ పురోగమనానికి నేతృత్వం వహిస్తోంది.

# ఖతార్‌లోని దోహాలో మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి రెండు రోజుల అధికారిక పర్యటన

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం పెట్రోలియం, సహజ వాయువుల శాఖ గౌరవ మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి ఏప్రిల్ 9వ తేదీన మధ్యాహ్నం దోహాకు చేరుకున్నారు. సాయంత్రం ఖతార్ ఇంధన వ్యవహారాల శాఖ సహాయమంత్రి, ఖతార్ ఎనర్జీ ప్రెసిడెంట్, సీఈఓ గౌరవ సాద్ షెరిదా అల్-కాబీతో సమావేశమయ్యారు.

ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీకి, ఖతార్ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి గౌరవ షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రెహమాన్ అల్ థానీకి భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరపున సందేశాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మార్చి 2026లో యుద్ధం ప్రారంభమైన తర్వాత పీఎం మోదీ, గౌరవ అమీర్ మధ్య జరిగిన రెండు ఫోన్ సంభాషణలను గుర్తు చేసుకున్నారు. శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించటానికి చర్చలు, దౌత్య మార్గాల ప్రాముఖ్యతను ఇరువురు నేతలు స్పష్టం చేశారు. ఖతార్ లోని భారత సమాజం పట్ల చూపిన ఆదరణ, అందించిన మద్దతుకు గానూ గౌరవ అమీర్‌కు పీఎం మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలపై ఇరుదేశాల మంత్రులు చర్చించారు. ఇందులో ఉన్నతస్థాయి చర్చలు, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాల వంటి అంశాలున్నాయి. త్వరలో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొంటాయని.. భారత్, ఖతార్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని కాంక్షించారు.

విశ్వసనీయ ఇంధన సరఫరాదారుగా కొనసాగేందుకు ఖతార్ కట్టుబడి ఉందని, భారత్‌తో ఇంధన సంబంధాలను, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని గౌరవ మంత్రి సాద్ షెరీదా అల్-కాబీ స్పష్టం చేశారు.ఏప్రిల్ 8న రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకారం తెలపటాన్ని ఇరువురు మంత్రులు స్వాగతించారు. ప్రపంచ ఇంధన సరఫరాలో అంతరాయానికి ముగింపు పలికి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థలను కాపాడేందుకు నిరంతర నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం అవసరమని తెలిపారు.

తనకు ఆతిథ్యం ఇచ్చినందుకు ఖతార్ ఇంధన శాఖ సహాయ మంత్రి గౌరవ సాద్ షెరీదా అల్-కాబీకి కేంద్రమంత్రి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే వారాల్లో నిరంతరం అందుబాటులో ఉండాలని ఇరువురు మంత్రులు నిర్ణయించుకున్నారు.

# గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) సెక్రటరీ జనరల్ జాసెమ్ మొహమ్మద్ అల్ బుదైవీతో కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సమావేశం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) సెక్రటరీ జనరల్ గౌరవనీయ జాసెమ్ మొహమ్మద్ అల్ బుదైవీతో ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు.

గల్ఫ్ ప్రాంతంలో ఇటీవల ప్రకటితమైన కాల్పుల విరమణ శాశ్వతం కావాలని, సుదీర్ఘ శాంతి-స్థిరత్వాలకు ఇది మార్గం సుగమం చేస్తుందని ఈ సందర్భంగా శ్రీ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరస్పర చర్చలతోనే విభేదాలను ద్వారా పరిష్కరించుకోగలమనే భారత్ సూత్రబద్ధ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు.

భారత్, జీసీసీల మధ్యగల బలమైన ప్రజా సంబంధాలే ఈ ప్రాంత దేశాలతో శక్తిమంతమైన ఆర్థిక, వాణిజ్య సంబంధాలకు మూలమని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఒక మైక్య శక్తిగా జీసీసీ తన వంతు పాత్రను కొనసాగించగలదని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు.

జీసీసీ దేశాలకు భారత్ సంఘీభావం తెలుపుతున్నదని తెలిపారు. అలాగే, నిత్యావసర ఆహార పదార్థాల సరఫరా శ్రేణిలో ఎదురయ్యే సవాళ్ల పరిష్కారంలో భారత్ మద్దతును పునరుద్ఘాటించారు. లాజిస్టిక్స్ బలోపేతం, స్థిరత్వ పరిరక్షణ దిశగా ప్రత్యామ్నాయ మార్గాన్వేషణకు జీసీసీ చేపట్టిన చర్యలను ఆయన అభినందించారు.

ఈ ప్రాంతంలో వాణిజ్య కార్యలాపాలు సజావుగా సాగిపోయేలా భరోసా ఇవ్వడంలో సమన్వయ సహిత కృషి ఆవశ్యకతను ఉభయపక్షాలూ అంగీకరించాయి. మొత్తం మీద సహకారం పరస్పర మద్దతు స్ఫూర్తితో భారత్-జీసీసీ ఆర్థిక భాగస్వామ్యం మరింత బలోపేతం చేయడంలో ఉమ్మడి నిబద్ధతను ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

# డాక్యుమెంటరీ, షార్ట్ ఫిక్షన్, యానిమేషన్ చిత్రాల కోసం జూన్ 15 నుంచి 21 వరకు 19వ ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13: డాక్యుమెంటరీ, షార్ట్ ఫిక్షన్, యానిమేషన్ చిత్రాల కోసం ఉద్దేశించిన 19వ ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఎమ్ఐఎఫ్ఎఫ్)-2026ను ముంబయిలోని ఎన్ఎఫ్‌డీసీ కాంప్లెక్స్ వేదికగా జూన్ 15 నుంచి 21 వరకు నిర్వహించనున్నారు.

ఈ ఉత్సవం... భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డాక్యుమెంటరీ చిత్రాల రూపకర్తలు, సినీరంగ నిపుణులు, సినీ అభిమానులు, రచయితలు, విద్యావేత్తలు, విమర్శకులు, పాత్రికేయులు, విద్యార్థులు, ఔత్సాహికులంతా ఈ ఉత్సాహభరితమైన సినీ వేడుకల్లో పాలు పంచుకోవాలని ఆహ్వానిస్తోంది.

ప్రస్తుతం, పోటీ విభాగంలో ప్రదర్శన కోసం చిత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించే ప్రక్రియ కొనసాగుతోంది. చిత్రాలను సమర్పించడానికి చివరి తేదీ ఏప్రిల్ 12, 2026. నిర్మాతలు, పంపిణీదారులు, హక్కుదారులు, వారు అధికారికంగా నియమించిన ప్రతినిధులు... నిబంధనలను పూర్తిగా చదివిన తర్వాత తమ చిత్రాలను "ఫిల్మ్ ఫ్రీవే' వేదిక ద్వారా మాత్రమే సమర్పించాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో సమర్పించే ఎంట్రీలను స్వీకరించరని వారు తెలియజేస్తున్నారు.

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) నిర్వహించే ఎమ్ఐఎఫ్ఎఫ్... నాన్-ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అత్యంత ఆకర్షణీయమైన పురస్కార ప్యాకేజీలను అందిస్తోంది. ఇందులో మొత్తం నగదు బహుమతుల విలువ రూ. 55 లక్షల వరకు ఉంటుంది. ఉత్తమ డాక్యుమెంటరీకి ప్రతిష్ఠాత్మక గోల్డెన్ కాంచ్ పురస్కారం సహా రూ. 10 లక్షల నగదు బహుమతి లభిస్తుంది. ఈ ఫెస్టివల్... నెట్‌వర్కింగ్, సహ-నిర్మాణ అవకాశాల కోసం ఒక విలువైన వేదికనూ అందిస్తుంది.

జూన్ 16 నుంచి 18 వరకు జరగనున్న 'వేవ్స్ డాక్ బజార్' రెండో ఎడిషన్ ఎమ్ఐ ఎఫ్ఎఫ్-2026లో ఒక ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ డాక్ బజార్‌లో సహ-నిర్మాణ మార్కెట్, వ్యూయింగ్ రూమ్, 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' ల్యాబ్ వంటి పలు విభాగాలు ఉంటాయి. నాన్-ఫీచర్ ఫిల్మ్ కేటగిరీ చిత్రాల ప్రపంచ స్థాయి కొనుగోలుదారులు, విక్రేతల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడం... డాక్యుమెంటరీ చిత్రాల రూపకల్పన, నిర్మాణం, పంపిణీ రంగాల్లో సహకారాన్ని, ఆవిష్కరణలను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం. వేవ్స్ డాక్ బజార్‌లో పాల్గొనడానికి సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే ఎమ్ఐఎఫ్ఎఫ్ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

1990లో ఏర్పాటు చేసిన ఎమ్ఐఎఫ్ఎఫ్... దక్షిణా సియాలోనే అత్యంత పురాతనమైన, అతిపెద్ద నాన్-ఫీచర్ ఫిల్మ్ ఫెస్టివల్. దీనిని ప్రతి రెండు సంవత్సరాలకోసారి నిర్వహిస్తారు. సంవత్సరాలుగా... ఈ ఫెస్టివల్ డాక్యుమెంటరీ, షార్ట్ ఫిక్షన్, యానిమేషన్ చిత్రాల నిర్మాణంలో శ్రేష్ఠతను ప్రదర్శించడం ద్వారా గణనీయమైన ఖ్యాతిని సంపాదించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రరూపకర్తలంతా ఇందులో పాల్గొనేలా ఈ కార్యక్రమం ఆకర్షిస్తోంది.

30కి పైగా దేశాల నుంచి 350కి పైగా చిత్రాలతో జరిగిన 18వ ఎమ్ఐఎఫ్ఎఫ్ ఉత్సవానికి అద్భుతమైన స్పందన లభించింది. ఈ ఉత్సవంలో అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీ విభాగాలు, పురస్కారం గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనలు, పునరుద్ధరించిన అలనాటి చిత్రాలు, ప్రత్యేకంగా రూపొందించిన నేపథ్య విభాగాలూ ఉన్నాయి.

## బ్రహెయిన్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గౌరవ అబ్దుల్లా బిన్ అడెల్ ఫఖ్రోతో సమావేశమైన భారత వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13: బ్రహెయిన్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గౌరవ శ్రీ అబ్దుల్లా బిన్ అడెల్ ఫఖ్రోతో... భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా, శ్రీ గోయల్ ఈ ప్రాంతానికి ప్రకటించిన కాల్పుల విరమణను స్వాగతించారు. కాల్పుల విరమణ శాశ్వతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఘర్షణల వల్ల తలెత్తిన ఇబ్బందుల నుంచి బ్రహెయిన్ సహా ఈ ప్రాంతంలోని దేశాలు త్వరగా కోలుకుంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నౌకా వాణిజ్యం, ఇతర మార్గాల ద్వారా అంచనా వేసిన వాణిజ్య కార్యకలాపాలు పూర్తి స్థాయిలో కొనసాగేలా చూడాల్సిన అవసరాన్ని శ్రీ గోయల్ ప్రధానంగా ప్రస్తావించారు.

# ప్రజావాణి దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత జిల్లా కలెక్టర్

## -ప్రజావాణి కి 63 వినతుల స్వీకరణ.

సంగారెడ్డి, ఏప్రిల్ 13 2026 ( నేటి నిజం ప్రతినిధి ) ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన మొత్తం 63 దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరి శీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా నలుమూలాల నుండి ప్రజలు నమ్మకంతో తమ సమస్యలను ప్రజావాణి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటి పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు.

ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. సంక్షేమం, రెవిన్యూ, వ్యవసాయం, గృహనిర్మాణం, మార్కెటింగ్, ఎంప్లాయ్మెంట్ తదితర శాఖలకు సంబంధించిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చూపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సహకార బ్యాంకింగ్ విస్తరణ, శ్వేత విప్లవం 2.0, సాంకేతికత ఆధారిత సహకార సంస్థల వృద్ధిపై దృష్టి సారించిన వారణాసి జాతీయ సదస్సు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో 2026 ఏప్రిల్ 9, 10 తేదీల్లో సహకార మంత్రిత్వ శాఖ నిర్వహించిన 7వ జాతీయ సమీక్షా సదస్సు బ్యాంకింగ్, పాడి పరిశ్రమ, ఆర్థిక వ్యవస్థలు, కొత్త సహకార నమూనాలతో సహా కీలక రంగాల్లో సంస్కరణలను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడం, పథకాల అమలును వేగవంతం చేయడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశం. క్షేత్రస్థాయిలో అడ్డంకులను తొలగించి, విధానపరమైన నిర్ణయాలు స్పష్టమైన ఫలితాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవడంపై ఈ చర్చలు సాగాయి.

రెండు రోజుల జాతీయ సమీక్ష సదస్సు ముగింపు సమావేశంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భుతానీ ప్రసంగించారు. తదుపరి దశ సంస్కరణలు క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలుపై ఆధారపడి ఉంటాయని ఆయన చెప్పారు. దీనికి భాగస్వాముల మధ్య మెరుగైన సమన్వయం, సకాలంలో వనరుల వినియోగం తోడ్పడతాయని తెలిపారు. గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, కేవలం కాలానుగుణ సమీక్షలకే పరిమితం కాకుండా, విధానపరమైన లక్ష్యాలకు అనుగుణంగా అమలు వేగవంతం కావాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పురోగతి తక్కువగా ఉన్న రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్ణయాలు వేగంగా తీసుకోవడం, సంస్థల మధ్య బలమైన సమన్వయం ఉండటం వల్ల స్పష్టమైన, శాశ్వతమైన ఫలితాలను సాధించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసీ) కంప్యూటరీకరణ, విస్తరణపై డాక్టర్ ఆశిష్ కుమార్ భుతానీ ప్రసంగిస్తూ.. ప్రస్తుతం కొనసాగుతున్న దశలను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం, పిఏసీల బలోపేతానికి చేపట్టిన కార్యక్రమాలను అదే వేగంతో ముందుకు తీసుకెళ్లడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. నాణ్యమైన ఫలితాలను సాధించడానికి పటిష్టమైన అమలు యంత్రాంగం, నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆయన చెప్పారు. అమలు ప్రక్రియలో భాగస్వాములైన వారు మరింత జవాబుదారీతనంతో ఉండాలని, వారి పనితీరు ఆధారంగానే మూల్యాంకనం జరగాలని ఆయన కోరారు. పథకాల ప్రారంభం సజావుగా సాగేలా సంస్థాగత సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. నిరంతర శిక్షణ, సామర్థ్య పెంపుదల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. నిర్దిష్ట పథకాల కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా ఈ వ్యవస్థలు సమర్థవంతంగా, స్థిరంగా కొనసాగాలని ఆయన పేర్కొన్నారు.

సహకార రంగంలో ధాన్యపు నిల్వ సామర్థ్య పెంపుదల పురోగతిని సమీక్షిస్తూ, ఈ పథకాన్ని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని, వివిధ సంస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని ఆయన పేర్కొన్నారు. భూమి లభ్యతను సులభతరం చేయడం, ప్రక్రియలను సరళతరం చేయడంతో పాటు క్షేత్రస్థాయి సవాళ్లను అధిగమించడానికి వినూత్న విధానాలను అవలంబించాలని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, సంస్థాగత బలోపేతంపై ఆయన ప్రసంగిస్తూ, సామర్థ్య పెంపుదల, లోపాలను గుర్తించడం, నిర్దేశిత లక్ష్య ఆధారిత చర్యల ద్వారా పాడి ఉత్పత్తి, మత్స్య రంగం వంటి వివిధ రంగాలలో సహకార పరిధిని విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రాలు తమ సహకార వ్యవస్థలను హేతుబద్ధం చేయాలని, బలోపేతం చేయాలని ఆయన కోరారు. అవసరమైన చోట వనిచేయని సంస్థల సమస్యను పరిష్కరించాలని కూడా ఆయన సూచించారు.

గ్రామ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బహుళ సేవా కేంద్రాలుగా ఎదగాలని, తమ వ్యాపారాలను వైవిధ్యీకరించుకోవడం వాటికి ఎంతో ముఖ్యమని కార్యదర్శి స్పష్టం చేశారు. అదనపు ఆదాయాన్నిచ్చే కార్యకలాపాలను చేపట్టడం, సేవల పరిధిని విస్తరించడం ద్వారా ఇవి బలోపేతం కావాలని ఆయన ప్రోత్సహించారు

సహకార బ్యాంకింగ్‌పై డాక్టర్ భుతానీ ప్రసంగిస్తూ, సైబర్ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, సురక్షితమైన డిజిటల్ వేదికలను ఏర్పాటు చేయడం, పనితీరులో సమర్థతను పెంచడం వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. దీనివల్ల సహకార బ్యాంకులు ఆర్థిక సవాళ్లను తట్టుకొని, మారుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలందించగలవని పేర్కొన్నారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) పాత్రను ప్రస్తావిస్తూ, వివిధ రంగాలకు సకాలంలో, సులభతరమైన ఆర్థిక సహాయం అందించడంలో దీని ప్రాముఖ్యత పెరుగుతోందని చెప్పారు. సహకార సంస్థలకు ఆర్థిక వనరులను మరింత మెరుగు పరిచేందుకు నిరంతర ప్రయత్నాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

మల్టీ-స్టేట్ సహకార సంఘాల గురించి సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ, మార్కెటింగ్, బ్రాండింగ్, నాణ్యమైన ముడి సరుకులకు సంబంధించిన అందుబాటులో ఉన్న వేదికలను, సేవలను రాష్ట్రాలు చురుగ్గా ఉపయోగించుకోవాలని కోరారు. తద్వారా సహకార సభ్యులకు గరిష్ట ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పాడి రంగంలో సహకార నిర్మాణాలను బలోపేతం చేయాలని, విలువ శ్రేణుల్లో రైతుల భాగస్వామ్యాన్ని పెంచాలని ఆయన చెప్పారు. దీనివల్ల సహకార నమూనాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అందుతాయని పేర్కొన్నారు. విజయవంతమైన, స్థిరమైన సహకార నమూనాలను అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఆయన సూచించారు.

సహకార రంగంలో వస్తున్న డిజిటల్ విప్లవాన్ని డాక్టర్ భుతానీ ప్రస్తావిస్తూ, 'భారత్ టాక్సీ' గురించి వివరించారు. ఇప్పటికే స్థిరపడిన ప్రైవేట్ సంస్థల నుంచి తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ, భారత్ టాక్సీ వేదిక తన పరిధిని క్రమంగా విస్తరిస్తోందని ఆయన పేర్కొన్నారు. లక్నో, ముంబై, నాసిక్ వంటి నగరాల్లో ఇప్పటికే దీని ప్రయోగాత్మక ప్రారంభం జరిగిందని, రాబోయే సంవత్సరాల్లో జాతీయ స్థాయిలో దీనిని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ఆయన తెలిపారు. సహకార ఆధారిత డిజిటల్ వేదికలకు పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శనమని ఆయన వెల్లడించారు.

చర్చల సారాంశాన్ని వివరిస్తూ.. తదుపరి దశ సంస్కరణల కోసం ప్రాధాన్యత కలిగిన రంగాలను ఈ సదస్సు స్పష్టంగా గుర్తించిందని సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. నిధుల వినియోగాన్ని మెరుగుపరచడం, సహకార బ్యాంకింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఎన్సీడీసీ మద్దతుతో వివిధ రంగాలకు ఆర్థిక సహాయాన్ని విస్తరించడం, సహకార సంస్థల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడం, అలాగే పాడి, దాని అనుబంధ రంగాల పథకాల అమలును వేగవంతం చేయడం వంటి అంశాలు ఇందులో ప్రధానంగా ఉన్నాయని ఆయన వివరించారు. సంస్థలు, వనరులు, అమలు యంత్రాంగాలు క్షేత్రస్థాయిలో ఎంత సమర్థవంతంగా సమన్వయం కాగలవనే దానిపైనే తదుపరి దశ వృద్ధి ఆధారపడి ఉంటుందని ఆయన చెప్పారు. సహకార సభ్యులకు స్పష్టమైన ప్రయోజనాలను అందించడానికి ఈ సమన్వయం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డిసిసిబిలు), రాష్ట్ర సహకార బ్యాంకులు (ఎస్టిసిబిలు), పట్టణ సహకార బ్యాంకులు (యుసిబి) తో సహా సహకార బ్యాంకింగ్ సంస్థల వైవిధ్యం, ఆధునీకరణపై ఈ సదస్సు ప్రధాన దృష్టి సారించింది. వ్యాపార పోర్ట్‌ఫోలియోలను విస్తరించడం, పీఏసీఎస్ ల ద్వారా రుణాల లభ్యతను మెరుగుపరచడం సామర్థ్యం, అందుబాటును పెంపొందించడానికి డిజిటల్ వేదికలను ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని ఈ చర్చల ద్వారా వివరించారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల మధ్య సమతుల్యతను పాటించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. సైబర్ భద్రత వ్యవస్థలను బలోపేతం చేయడం, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను అవలంబించడం ద్వారా సహకార బ్యాంకులను మరింత పోటీతత్వంతో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. దీనివల్ల మారుతున్న ఆర్థిక అవసరాలకు అనుగుణంగా బ్యాంకులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని సదస్సు అభిప్రాయపడింది.

నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్సీడీసీ) నిర్వహించిన ప్రత్యేక సెషన్ ఈ సదస్సులో మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్పీఓ), మత్స్య రంగం, చక్కెర పరిశ్రమ, ఆహార సంస్కరణలు, సముద్ర లోతుల్లో చేపల వేట వంటి వివిధ రంగాలలో విస్తరించిన ఆర్థిక సహాయ అవకాశాలను ఈ సందర్భంగా వివరించారు. అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయాన్ని చురుగ్గా ఉపయోగించుకోవాలని, తద్వారా సహకార సంస్థలను పెద్ద ఎత్తున విస్తరించాలని ఈ సెషన్ స్పష్టం చేసింది. ఇలా చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని, దేశంలోని సహకార వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని తెలిపింది.

సహకార రంగాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంపై జరిగిన చర్చలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాడి పరిశ్రమ సహకార సంఘాలు, సమాఖ్యలు, సహకార బ్యాంకుల మధ్య సమన్వయాన్ని పెంచడం ద్వారా సమర్థవంతమైన విలువ వ్యవస్థలను సృష్టించడం, మొత్తం ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో, శ్వేత విప్లవం 2.0 పై జరిగిన చర్చలు పాల సేకరణను పెంచడం, డెయిరీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, రాష్ట్రాలు, ప్రముఖ డెయిరీ సంస్థల చురుకైన భాగస్వామ్యంతో సహకార ఆధారిత విలువ వ్యవస్థలను విస్తరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశాయి.

రాష్ట్రాల ఉత్తమ పనితీరు తీరుతెన్నులపై జరిగిన ప్రత్యేక సెషన్, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'సహకార్ సే సమృద్ధి' నమూనాను ప్రదర్శించింది. ఇది జిల్లా స్థాయి ఆవిష్కరణలను, విస్తరించదగిన సహకార నమూనాలను ప్రముఖంగా వివరించింది. పరిపాలనాపరమైన ఏకీకరణ, సంస్థాగత సమన్వయం, స్థానిక నాయకత్వం ద్వారా సహకార రంగంలో ఎంత సమర్థవంతమైన అమలు కొలవదగిన ప్రభావం సాధించవచ్చో ఈ సెషన్ ప్రముఖంగా తెలిపింది. 'సహకార సంవాద్' సెషన్ విజయవంతమైన సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సమాఖ్యలు, ఆర్థిక సంస్థల మధ్య ముఖాముఖి చర్చలకు వీలు కల్పించింది. ఈ వేదిక క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకోవడానికి, కార్యకలాపాల్లోని సవాళ్లను చర్చించడానికి, వినూత్న పద్ధతులను పరస్పరం మార్పిడి చేసుకోవడానికి ఎంతగానో దోహదపడింది.

మీడియా, కమ్యూనికేషన్ వ్యూహంపై జరిగిన ప్రత్యేక సెషన్, సహకార రంగం గురించి సానుకూల కథనాలను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది. ప్రజల్లోకి ఈ అంశాలను బలంగా తీసుకెళ్లడంతో పాటు, అవగాహన, నమ్మకాన్ని పెంపొందించడానికి "పని చేయడం, తెలియజేయడం" అనే విధానాన్ని అవలంబించాలని సూచించింది.

సంస్కరణలను వేగవంతం చేయడం, అమలు యంత్రాంగాలను బలోపేతం చేయడం, సహకార కార్యక్రమాలు గ్రామీణ వర్గాలకు, అలాగే విస్తృత ఆర్థిక వ్యవస్థకు అర్థవంతమైన, స్థిరమైన ఫలితాలను అందించేలా చూడాలనే కేంద్రం, రాష్ట్రాలు, సహకార సంస్థల ఉమ్మడి నిబద్ధతతో ఈ సదస్సు ముగిసింది.

## బచ్చన్నపేటను మద్యం రహిత మండలంగా తీర్చిదిద్దుదాం : పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ ఏప్రిల్ 13 : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాన్ని మద్యం రహిత మండలం గా తీర్చిదిద్దు కుందామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని చిన్న రామన్ చర్ల, నక్కవాని గూడెం, రామచంద్ర గూడెం, కొడవటూరు, కొన్నే, పడమటి కేశపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో బెల్ట్ షాపుల జోరు ఎక్కువైందని, ఫలితంగా ప్రజలు తెల్లవారకముందే బెల్ట్ షాపుల్లోకి వెళ్లి మద్యం సేవించి అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు బార్లను తలపిస్తున్నాయని అన్నారు. అంతేకాకుండా ఎంఆర్పి ధరలకంటే అధికంగా వసూలు చేస్తూ, ప్రజల డబ్బులను దోచుకుంటున్నారన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఇష్ట రాజ్యాంగ నడుస్తున్న ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మండలంలో నాలుగు గ్రామాల్లో మద్య నిషేధం అమల్లో ఉందని, గ్రామాల్లో స్ఫూర్తిగా తీసుకొని ప్రతి గ్రామంలో మద్యనిషేధ అమలు చేసుకోవాలని సూచించారు.

# కువైట్ మంత్రి గౌరవ ఒసామా ఖలీద్ బూడాయ్‌తో సమావేశమైన భారత కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:కువైట్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి గౌరవ ఒసామా ఖలీద్ బూడాయ్‌తో... భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా సమావేశమయ్యారు.

ఘర్షణల సమయంలో కువైట్‌లో సంభవించిన నష్టాన్ని, విధ్వంసాన్ని ఈ సందర్భంగా శ్రీ గోయల్ తీవ్రంగా ఖండించారు.

ఈ ప్రాంతంలో శాశ్వతంగా శాంతి నెలకొనడం యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని భావిస్తున్న భారత్ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు.

భారత్-కువైట్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు గాను వాణిజ్య, వ్యాపార రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై ఇరువురు మంత్రులు ప్రధానంగా చర్చించారు. మరింత ఆర్థిక సహకారం, ఉమ్మడి శ్రేయస్సును సాధించడానికి బలమైన ద్వైపాక్షిక సంబంధాలు కీలకమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కువైట్‌లోని భారతీయ పౌరుల క్షేమం, భద్రతను నిర్ధారించడంలో కువైట్ నాయకత్వం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

సంభాషణలు, దౌత్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ... ఇంధన సరఫరాలు, వాణిజ్య కార్యకలాపాలకు ఏర్పడిన అంతరాయాలను తొలగించడం ద్వారా వీలైనంత త్వరగా వాటిని పునరుద్ధరించేందుకు ఇరువురు మంత్రులు అంగీకరించారు. ఒక విశ్వసనీయ, నమ్మదగిన భాగస్వామిగా... ముఖ్యంగా కువైట్ ఆహార భద్రతకు సంబంధించి ఏవైనా సరఫరా సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో సహాయం అందించడానికి భారత్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# నిరంతరాయంగా వాణిజ్యం, భాగస్వామ్య పక్షాల ఆందోళనలకు పరిష్కారం, సరఫరా వ్యవస్థ స్థిరీకరణ దిశగా సమన్వయంతో కూడిన చర్యలు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో, సమన్వయంతో కూడిన క్రియాశీల చర్యలను భారత ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా భారత వాణిజ్య, ఎగుమతి వ్యవస్థలను ప్రభావితం చేస్తున్న వస్త్ర రవాణా, ప్యాకేజింగ్, నౌకాయాన సంబంధిత అవరోధాలను అధిగమించడం కోసం.. ఆయా రంగాల నిపుణులు, ఉన్నతాధికారులతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది.

ఈ దిశగా రెండు కీలక సమావేశాలు జరిగాయి. ఒక సమావేశాన్ని వాణిజ్య శాఖ కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించగా.. ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంవోపీఎస్‌డబ్ల్యూ) కార్యదర్శి - వాణిజ్య శాఖ కార్యదర్శి మరో సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఓడరేవు అధికారులు, నౌకాయాన సంస్థలు, ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమల ప్రతినిధులు, ఇతర భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

వాణిజ్య శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. ప్యాకేజింగ్ సామగ్రి, వాటికి అవసరమైన ముడిసరుకుల సరఫరాలో తలెత్తుతున్న సమస్యలపై చర్చించారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిణామాలతో.. పాలిమర్లు, రెసిన్ల వంటి కీలకమైన పెట్రోకెమికల్ ఉత్పత్తుల ధరలు పెరగడమే కాకుండా, వాటి లభ్యతపై ప్రభావం పడే అవకాశాలను చర్చించారు. దీనివల్ల అన్ని రంగాల్లోనూ ప్యాకేజింగ్ సామగ్రి ఖర్చులు పెరగవచ్చని భావిస్తున్నారు. కీలకమైన ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల.. ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయని పరిశ్రమల ప్రతినిధులు వివరించారు.

సరఫరా వ్యవస్థలో ఆటంకాలు, రవాణా ఇబ్బందులు, ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల.. దుస్తులు, తోలు, టెలికాం/ఆప్టికల్ ఫైబర్, వైద్య పరికరాల వంటి పరిశ్రమలపై ప్రభావం పడే అవకాశం ఉందని వివిధ రంగాల ప్రతినిధులు వివరించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూనే.. ఎల్ఎన్జీ, హీలియం, పెట్రోకెమికల్ ఉత్పన్నాల వంటి కీలక ముడిసరుకుల లభ్యత విషయంలో అంతరాయాలు లేకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అలాగే, పరిశ్రమల వద్ద నగదు లభ్యత పెరగడానికి వీలుగా జీఎస్టీ రీఫండ్లను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సవాళ్లు అనేక రంగాలపై ప్రభావం చూపుతాయని వాణిజ్య శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. కీలక ముడిసరుకుల లభ్యతలో అంతరాయం లేకుండా చూడడం, ఉత్పత్తిలో ఆటంకాలు కలగకుండా జాగ్రత్త పడడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్యాకేజింగ్‌కు కీలకమైన ముడిసరుకులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలనీ, దేశంలో వాటి ఉత్పత్తి సామర్థ్యం - దిగుమతులపై మన ఆధీనతలను అంచనా వేయాలని సూచించారు. అలాగే ఎగుమతి - దిగుమతుల ధోరణులను, వివిధ రంగాల్లో ఒత్తిళ్లను ప్రతివారం పర్యవేక్షించడం కోసం ఒక నిర్మాణాత్మక పర్యవేక్షక వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. కొత్తగా తలెత్తే సవాళ్లను గుర్తించి, సకాలంలో వాటి పరిష్కార చర్యలను చేపట్టేందుకు.. పరిశ్రమల ప్రతినిధులతో, ఎగుమతి ప్రోత్సాహక మండళ్లతో నిరంతరం సంప్రదింపులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఎంవోపీఎస్‌డబ్ల్యూ కార్యదర్శి - వాణిజ్య శాఖ కార్యదర్శి సంయుక్తంగా అధ్యక్షత వహించిన రెండో సమావేశం.. భాగస్వామ్య పక్షాలు లేవనెత్తిన వస్తు రవాణా, నౌకాయాన సంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ఓ నిర్మాణాత్మక వేదికగా నిలిచింది. కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (సీబీఐసీ) చైర్మన్ కూడా హాజరైన ఈ సమావేశంలో సమన్వయంతో కూడిన సమగ్ర చర్చలు జరిగాయి.

డాక్యుమెంటేషన్ ప్రక్రియ, ఎగుమతి కాకుండా వెనక్కు వచ్చే సరుకు, సరుకు రవాణా సమస్యలు, షిప్పింగ్ లైన్లతో ప్రయోజనాలు, వైమానిక మార్గాల్లో సరుకు రవాణా వ్యయం, రైల్వే రాయితీలు, బంకర్లలో ఇంధన లభ్యత సహా.. వివిధ అంశాలపై నౌకాయాన కార్యదర్శి చర్చించారు. నిర్వహణపరమైన సవాళ్ల పరిష్కారంలో ప్రభుత్వ క్రియాశీలతకు ఈ చర్చలు నిదర్శనం.

ఓడల లభ్యత, సరుకు నిర్వహణ, ఓడల నడుమ సరుకు మార్పిడి వంటి ప్రస్తుత పరిస్థితులపై సంబంధిత భాగస్వామ్య పక్షాలకు వివరించారు. సరుకు రవాణా సాఫీగా సాగుతోందని, పెద్ద అడ్డంకులేవీ లేవని అధికారు లు తెలిపారు. ఇది మన రవాణా వ్యవస్థ పటిష్టతను చాటుతోంది.

ఓడరేవుల వద్ద సరుకు అనుమతుల ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు తీసుకున్న వివిధ చర్యలను సీబీఐసీ చైర్మన్ వివరించారు.

# మౌలిక సదుపాయాలు.. డిజిటల్ వేదికలు.. పరిశోధనల ద్వారా ఆయుష్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోంది: వైద్య రాజేష్ కోటేచా

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:'ప్రపంచ హోమియోపతి దినోత్సవం-2026' నేపథ్యంలో "సుస్థిర ఆరోగ్యానికి హోమియోపతి" ఇతివృత్తంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఇవాళ న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ స్థాయి వేడుకలు నిర్వహించింది. హోమియోపతి విధాన రూపకర్త డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి విధాన రూపకర్తలు, పరిశోధకులు, వైద్యులు, విద్యావేత్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుస్థిర ఆరోగ్య సంరక్షణలో అందరికీ అందుబాటుతో హోమియోపతి పోషిస్తున్న కీలక పాత్రను వక్తలు ప్రముఖంగా ప్రస్తావించారు.

కేంద్ర ఆయుష్ (స్వతంత్ర బాధ్యత), ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖల సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ మాట్లాడుతూ- "బలమైన వ్యవస్థలు, పరిశోధన సంస్థల తోడ్పాటుతో భారత హోమియోపతి రంగం కొన్నేళ్లుగా విస్తృత స్థాయిలో మానవ వనరులను సమకూర్చుంది. ఈ మేరకు 'సీసీఆంహెచ్, ఎన్‌సీహెచ్, ఎన్‌ఐహెచ్' వంటి సంస్థలు హోమియోపతి రంగ శాస్త్రీయ పునాదిని, నియంత్రణ వ్యవస్థను సదా బలోపేతం చేస్తున్నాయి. నాణ్యమైన పరిశోధనలు, విద్య, వైద్య సేవల ప్రదానం ద్వారా అందుబాటులో చౌకగా, అర్థవంతంగా పనిచేస్తూ ఈ వైద్య విధానంపై సామాన్యులలో నమ్మకాన్ని ఇనుమడింపజేస్తున్నాయి" అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా హోమియోపతిని విశ్వసనీయ వైద్య విధానంగా నిలబెట్టేందుకు నిదర్శనాధారిత ప్రగతి, అంతర్-విభాగ సహకారం, నిరంతర పరిశోధనలు అత్యావశ్యకమని మంత్రి స్పష్టం చేశారు. శాస్త్రీయ అధ్యయనాల మెరుగుదల, విద్యా ప్రమాణాల పెంపు, వైద్యులు-పరిశోధకుల మధ్య సమన్వయంతో రోగి-కేంద్రక వైద్య సేవలు అందించవచ్చునని ఆయన తెలిపారు. జాతీయ ప్రాథమ్యాలు, అంతర్జాతీయ ఆరోగ్య లక్ష్యాల మేరకు సంపూర్ణ-సుస్థిర ఆరోగ్య విధానాలను ప్రోత్సహించడంపై ప్రభుత్వం నిబద్ధతతో ఉందని పునరుద్ఘాటించారు.

ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా మాట్లాడుతూ- నిదర్శనాధారిత ఆరోగ్య సంరక్షణ దిశగా మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు, సేవల విస్తరణ, ఆయుష్ గ్రిడ్, హెచ్‌ఎంఐఎస్ వంటి డిజిటల్ వేదికల ద్వారా ప్రభుత్వం ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేస్తోందని గుర్తుచేశారు. అంతేకాకుండా నిపుణ, భవిష్యత్ సంసిద్ధ శ్రామిక శక్తిని రూపొందించే దిశగా విద్య-శిక్షణ వ్యవస్థల ఆధునికీకరణకు సాగుతున్న కృషిని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

బలమైన సంస్థాగత నెట్‌వర్క్, పరిశోధన-ప్రామాణీకరణకు పెరుగుతున్న ప్రాధాన్యం సహా అందుబాటులోగల, సుస్థిర ఆరోగ్య సంరక్షణకు దోహదం చేయడం ద్వారా హోమియోపతి రంగంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఆవిర్భవించిందని శ్రీ కొటేచా విశదీకరించారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి డి.అలర్మేల్ మంగై మాట్లాడుతూ- సంస్థాగత పురోమనం, ప్రామాణీకరణ, ప్రపంచవ్యాప్త విస్తరణకు అధిక ప్రాధాన్యంతో భారత ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో హోమియోపతి కీలక పాత్ర పోషిస్తున్నదని చెప్పారు. హోమియో వైద్యుల జాతీయ రిజిస్టర్ వంటి కార్యక్రమాలు ఈ విధాన పారదర్శకతను పెంచుతూ, వృత్తిపరంగానూ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. అలాగే, విద్యా సంస్థలు-వైద్యుల నెట్‌వర్క్ విస్తరణ ద్వారా ఈ వ్యవస్థకు పెరుగుతున్న ప్రజావోదం స్పష్టమవుతున్నదని ఆమె పేర్కొన్నారు. సురక్షిత, విశ్వసనీయ, సమర్థ రోగి సంరక్షణకు భరోసా ఇస్తూ, క్లినికల్ శిక్షణ-ఔషధ నాణ్యతలో ఉన్నత ప్రమాణాలతో ఈ విస్తరణను అనుసంధానించాల్సి ఉందని స్పష్టం చేశారు.

అనంతరం ఆయుష్ మంత్రిత్వ శాఖ (హోమియోపతి) సలహాదారు డాక్టర్ ప్రీత కిళ క్కుటిల్ ప్రసంగిస్తూ- హోమియోపతి విధానం రోగి-కేంద్రక, చౌక ఆరోగ్య సంరక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. వ్యాధి నివారణ, దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణలో దీనికి గణనీయ సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. తమ మంత్రిత్వ శాఖ నేతృత్వాన నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ఈ వైద్య విధానం సామాన్యులందరికీ అందుబాటులోకి వస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో ఏకీకరణ ప్రక్రియను మెరుగుపరచడమేగాక విద్య, పరిశోధన, వృత్తి నైతికతపై నిరంతర దృష్టి ఫలితంగా వ్యవస్థ విశ్వసనీయత, విస్తృతి బలోపేతం అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో 'సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి' డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుభాష్ కౌశిక్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ మేరకు "హోమియోపతికి పెరుగుతున్న గుర్తింపును ప్రతిబింబించే ఓ కీలక జాతీయ, అంతర్జాతీయ వేదికగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం రూపుదిద్దుకుంది. ఈ రంగంలో విస్తృత చర్చలు, ఆవిష్కరణలు, సహకారం తదితరాలను ప్రోత్సహించే దిశగా పరిశోధకులు, వైద్యులు, విద్యావేత్తలు, విధాన రూపకర్తలను ఈ కార్యక్రమం ఒక వేదికపైకి తెచ్చింది. శాస్త్రవిజ్ఞానం అర్థవంతమైన ప్రజారోగ్య ఫలితాలిచ్చేదిగా మారడంలో పరిశోధన, విధానం, ఆచరణల మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడమే నేటి మన ప్రధాన లక్ష్యం'' అని వివరించారు.'నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి' చైర్‌పర్సన్ డాక్టర్ తారకేశ్వర్ జైన్ ప్రసంగిస్తూ- "దేశంలో నేడు హోమియోపతి ప్రత్యామ్నాయ విధానంగానే కాకుండా 3.45 లక్షల మందికిపైగా నమోదిత వైద్యులు, 291 విద్యా సంస్థల మద్దతుతో ప్రధాన వైద్య విధానంగానూ స్థిరపడింది. నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి ద్వారా ఈ వ్యవస్థ విశ్వసనీయత, ప్రభావాలను మరింత పెంచడం కోసం పారదర్శకత, విద్యా నాణ్యత, నైతిక ప్రమాణాలను మేం బలోపేతం చేస్తున్నాం" అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా 'సీసీఆర్‌హెచ్' కొత్త అధికారిక లోగో, వేడుకల సూవెనీర్ సహా పలు కీలక ప్రచురణలు, విజ్ఞాన వనరులను ఆవిష్కరించారు. వీటిలో "సీసీఆర్‌హెచ్ జర్నీ: పబ్లికేషన్ ఔట్రీచ్ అండ్ నాలెడ్జ్ డిస్సెమినేషన్" పేరిట అకోరన్ కలామస్‌పై ఒక మోనోగ్రాఫ్ సహా "సైంటిఫిక్ పర్స్పెక్టివ్స్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్స్: ఎ ప్రాక్టీషనర్స్ గైడ్'' కూడా ఉన్నాయి. 'సీసీఆర్‌హెచ్' ప్రచురించే నవీకృత 'న్యూస్‌లెటర్', 'ఇండియన్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి' సంపుటం 20లో 1వ (తాజా) సంచిక సహా నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి చట్టం- నియమ నిబంధనల సంపుటం-2ను కూడా ఆవిష్కరించారు.

హోమియో రంగం డిజిటలీకరణ సంబంధిత రంగంలో ఆయుష్ గ్రిడ్ పోర్టల్ ద్వారా సర్టిఫికేషన్ కోర్సు, ఏఐ ఆధారిత విజ్ఞాన విస్తరణ కంటెంట్, 'ఐఆర్ఐఎన్ఎస్' అనుసంధానం, హిందీ పదకోశం వెబ్‌సైట్, హోమియో అవగాహన వారోత్సవాల (2026 ఏప్రిల్ 1?7) సందర్భంగా దేశమంతటా నిర్వహించిన కార్యక్రమాల ఆడియో-విజువల్ సంకలనం వంటి కీలక కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

హోమియోపతిని ఒక నిదర్శనాధారిత, సౌలభ్య, రోగి-కేంద్రక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా బలోపేతం చేయడంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం పునరుద్ఘాటించింది. ఇందులో భాగంగా పరిశోధన, విద్య, డిజిటల్ అనుసంధానం, ప్రజానీకానికి చేరువ చేయడంపై ఆయుష్ మంత్రిత్వ శాఖ నిరంతరం దృష్టి సారిస్తోంది. తద్వారా సమాజంలోని అన్ని వర్గాలకూ సరసమైన, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ ప్రదానంలో హోమియో పాత్రను మరింతగా విస్తరించాలని లక్ష్యనిర్దేశం చేసుకుంది.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్ఐ ఎన్.వెంకన్న

నల్గొండ, ఏప్రిల్ 13:రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్రంపోడు ఎస్ఐ ఎన్.వెంకన్న అన్నారు. సోమవారం మండలంలోని పాల్వాయి గ్రామంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో "అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన లోపం వల్లే జరుగుతున్నాయన్నారు. కావునా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం జరుగుతోందని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా వాహనదారులు తమ వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. పాఠశాలలు, కళాశాలలో, యువతకు, గ్రామాలలో గ్రామస్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీల సహకారంతో రోడ్డు భద్రతపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఎన్.కరుణశ్రీ, ఏఓ కంచర్ల మాధవరెడ్డి, హెచ్ఎం విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ మంచికంటి ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి సైదులు, స్థానికులు, ఆటో, ఇతర వాహనదారులు పాల్గొన్నారు.

# గోమాతలకు గ్రాసం పంపిణీ



నల్గొండ, ఏప్రిల్ 13: మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గోమాతలకు అప్పన్నపేట గ్రామానికి చెందిన ఎదుల్ల మోహన్ రెడ్డి ధర్మపత్ని శ్రీలత కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో ఒక ట్రాక్టర్ గడ్డిని అందజేశారు.

ఈ సందర్భంగా వారు స్పందిస్తూ.. గో సేవ ఎంతో పుణ్య కార్యమని, ప్రతి ఒక్కరూ తమ వంతుగా గోమాతలను పరిరక్షించాలని కోరారు.

ఈ కార్యక్ర మంలో పెండెం వెంకయ్య, దుర్గమ్మ, బండ వెంకటరెడ్డి, కారింగుల వీరస్వామి, మేకపోతుల వెంకన్న, గరిడేపల్లి గ్రామ పురోహితులు కొంపెల్లి కృష్ణయ్య, పుట్ట బక్కయ్య, మేకపోతుల పురుషోత్తం పాల్గొన్నారు.

# జీవనశైలిని సానుకూల దిశగా మలిచే శక్తివంతమైన సాధనం యోగా : కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ ఏప్రిల్ 13 : యోగా శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే మార్గమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. ప్రజాపాలన-పురోగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అనంతరం కలెక్టర్ స్వయంగా యోగాసనాలు చేసి పాల్గొన్నవారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా మన భారతీయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగమని, ఇది వేల సంవత్సరాల చరిత్ర కలిగిన జీవన విధానమని తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం : కలెక్టర్ అంకిత్



ఖమ్మం, ఏప్రిల్ 13:ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం చుంచుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ-అడిక్షన్, కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమన్నారు. ఈ గ్రామ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆస్పత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామ సభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు.

కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న "నో హెల్మెట్‌నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదా లు జరుగుతున్నాయని, వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తాసీల్దార్ నాగరాజు, పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'పది' పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై కలెక్టర్ అంకిత్ తనిఖీ

ఖమ్మం, ఏప్రిల్ 13: పాల్వంచలోని బొల్లొరిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. తనిఖీలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థులు కూర్చునే విధానం, ప్రశాంత వాతావరణం, తగిన వెలుతురు, తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత పాటించాలని అధికారులను ఆదేశించారు.

ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్ఐ ఎన్.వెంకన్న




నల్గొండ, ఏప్రిల్ 13:రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్రంపోడు ఎస్ఐ ఎన్.వెంకన్న అన్నారు. సోమవారం మండలంలోని పాల్వాయి గ్రామంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో "అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు చాలా వరకు నిర్లక్ష్యం, అతివేగం, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన లోపం వల్లే జరుగుతున్నాయన్నారు. కావునా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం జరుగుతోందని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా శిక్షార్హమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా వాహనదారులు తమ వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. పాఠశాలలు, కళాశాలలో, యువతకు, గ్రామాలలో గ్రామస్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీల సహకారంతో రోడ్డు భద్రతపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఎన్.కరుణశ్రీ, ఏఓ కంచర్ల మాధవరెడ్డి, హెచ్ఎం విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ మంచికంటి ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి సైదులు, స్థానికులు, ఆటో, ఇతర వాహనదారులు పాల్గొన్నారు.

# జగిత్యాల సభను జయప్రదం చేయాలి

**-20న నిర్వహించే కేసీఆర్ సభపై కరీంనగర్‌లో కేటీఆర్ సన్నాహక సమావేశం**

**-సభానిర్వహణపై ముఖ్య నాయకులకు సూచనలు**

**-హాజరైన ఉమ్మడి జిల్లా నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు**



కరీంనగర్, ఏప్రిల్ 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 20న జగిత్యాలకు వస్తున్న సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదివారం రాత్రి కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఆయన ఉమ్మడి జిల్లా ముఖ్యనాయకులతో ఈ విషయమై చర్చించారు. ఏ నియోజకవర్గం నుంచి ఎంత మందిని తరలించాలనేది ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులకు బాధ్యతలు అప్పగించారు. మాజీ మంత్రి టీ జీవన్‌రెడ్డి చేరిక సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించాలని సూచించారు. జగిత్యాల, చొప్పదండి, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించాలని, కరీంనగర్ నియోజకవర్గం నుంచి 5 వేల మందిని, ఉమ్మడి జిల్లా పరిధి లోని మిగతా ఒక్కో నియోజకవర్గం నుంచి 3 వేల మందిని తరలించాలని తెలిపారు. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులకు కార్యకర్తల సమీకరణపై పలు సూచనలు చేశారు. నియోజవర్గ ఇన్‌చార్జులుగా ఉన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు ఈ బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితల సతీశ్‌కుమార్, పుట్ట మధూకర్, సుంకె రవిశంకర్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా అంత్యక్రియల్లో పాల్గొన్న సినీ ప్రముఖులు



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:ఆశా భోస్లే గళ విన్యాసాలకు అభిమానులు కాని వారుండరు. ఒక్కసారి ఆశా గాత్రంతో స్నేహం చేస్తే చాలు ఆ మధురం మనల్ని వెంటాడుతూనే ఉంటుందని ప్రతీతి. ఆశా గళం నుండి జాలువారిన సినిమా గీతాలు, గజల్స్, భజన్స్, పాప్ సాంగ్స్, ఫోక్ సాంగ్స్, శాస్త్రీయ సంగీతం- అన్నీ భారతీయ సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 12000 పాటలు పాడి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు ఆశా. మేరునగ సమానురాలయిన అక్క లతా మంగేష్కర్ గానవైభవం సాగుతూ ఉండగానే ఆశా తనదైన బాణీ పలికించడం విశేషం. అక్క ఛాయ నుండి బయటపడి తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించారు ఆశా. రెండు సార్లు ఉత్తమగాయనిగా నేషనల్ అవార్డు అందుకున్న ఆశా భోస్లే కీర్తి కిరీటంలో 'పద్మవిభూషణ్'తో పాటు పలు అవార్డులు రత్నాల్లా



భర్త గణపత్ రావ్ భోస్లే సహాయ సహకారాలు మరువలేనివి. ఇక ఓ.పి.నయ్యర్ స్వరకల్పనలో ఆశా గాత్రంలో జాలువారిన గీతాలు అభిమానులను కట్టిపడేశాయి. భోస్లే మరణానంతరం ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.డి. బర్మన్‌ను వివాహమాడిన తరువాత కూడా ఆశా భోస్లే గాన విన్యాసాలు సంగీతాభిమానులను పులకింప చేశాయి. కొన్ని పాటలు లతా మంగేష్కర్ కంటే ఆశా నే బాగా పాడగలదు అనే పేరూ సంపాదిం చారు. ఆశా అంత్యక్రియల్లో పాల్గొన్న సినీ ప్రముఖులు ఆమెతో తమ అనుబంధాన్ని తలచుకొని కన్నీరు మున్నీరయ్యారు.



ఆశా భోస్లే - ఆర్డీ బర్మన్ కాంబోలో రూపొందిన అనేక గీతాలు ఈ నాటికీ అభిమానులను పులకింప చేస్తూనే ఉన్నాయి. దాసరి నారాయణరావు 'పాలు-నీళ్ళు'లో తొలిసారి తెలుగు పాట పాడిన ఆశా భోస్లే, తరువాత మరికొన్ని తెలుగు చిత్రాల్లోనూ తన గానంతో ఆకట్టుకున్నారు. వెంకటేశ్ 'పవిత్రబంధం' మూవీలో తెరపైనా కనిపించారు ఆశా. తన భర్త ఆర్డీ బర్మన్ బాణీల్లో రూపొందిన 'చిన్నికృష్ణుడు'లో బాలుతో కలసి పాడిన యుగళగీతం తనకెంతో ఇష్టమని చెప్పేవారామె. యావద్భారతంలోని సంగీతాభిమానులను దుఃఖసాగరంలో ముంచుతూ ఆశా దివికేగారు. ఆమె పాట మాత్రం మనతోనే ఉంది. ఆ మధురం మనకు ఆనందం పంచుతూనే ఉంటుంది.

వెలుగుతూనే ఉన్నాయి. ఆ వెలుగును మనకు వదిలేసి మరలిరాని లోకాలకు తరలిపోయారు ఆశా. ఆమె పంచిన మధురాన్ని మననం చేసుకుంటూ అభిమానులు బాధను దిగమింగారు. భారతీయ సినిమా ప్రపంచంలో గానకోకిలగా రాజ్యమేలిన లతా మంగేష్కర్ చెల్లెలిగా ఆశా గానం ఆరంభమైంది. అయితే అక్క ప్రభావం తనపై పడకుండా జాగ్రత్త పడుతూనే ఆశా గళవిన్యాసాలు సాగాయి. అందుకు ఆమె

# జాతీయ రహదారుల టోల్ ప్లాజాల వద్ద 'డిజిటల్-మాత్రమే' టోల్ వసూలు విధానం అమలు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:టోల్ వసూలులో సామర్థ్యం, పారదర్శకతను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది. 10.04.2026 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల టోల్ ప్లాజాల వద్ద అన్ని రకాల రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల ద్వారా మాత్రమే వసూలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికలు కొనసాగుతున్న తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఆయా ప్రాంతాల్లో దీనిని ప్రస్తుతానికి అమలు చేయడం లేదు.

# కార్మికులకు హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దే : శ్రీనివాసరావు




ఆదిలాబాద్, ఏప్రిల్ 13:కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు, సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేనటువంటి హక్కులను సింగరేణి కార్మికులకు అందజేయడం జరిగిందని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు అన్నారు. టీబీజీకేఎస్ హయాంలో సాధించిన హక్కులను తెలుపుతూ కరపత్రాలను ముద్రించి బెల్లంపల్లి ఏరియా తాండూర్ మండలంలోని ఏరియా స్టోర్, వర్క్ షాప్ లలో సోమవారం కార్మికులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా సింగరేణిలో గెలిచిన ఏఐటీయూసీ గాని రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గాని ఒక్క హక్కు సాధించకపోగా కేసీఆర్, టీబీజీకేఎస్ సాధించిన తండ్రి కొడుకుల ఉద్యోగాలను నిలిపివేయడం జరిగిందని, మెడికల్ బోర్డును గత సంవత్సరం నుంచి నిర్వహించడం లేదన్నారు.

250 గజాల ఇంటి స్థలం ఇస్తానన్న మాట మర్చిపోయారని మేనిఫెస్టోలో పేర్కొన్న 45 హామీలను ఇచ్చి మర్చిపోయారని వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, ఏరియా నాయకులు రమేష్, వెంకటేష్, పిట్ కార్యదర్శి గణపతి, ఏరియా వర్క్ షాప్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో జన్మించిన ఆడ చిరుతకు కునో జాతీయ పార్క్‌లో నాలుగు కూనలు జననం

## ఇది భారతదేశపు 'చీతా సంరక్షణ ప్రయాణం'లో ఒక చారిత్రాత్మక ఘట్టం: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:భారతదేశ చీతా సంరక్షణ ప్రయాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఈ రోజు కొనియాడారు. భారత్‌లో జన్మించిన ఆడ చిరుత (గామిని మొదటి సంతతిలోని రెండవ పిల్ల - కేపీజీ12, వయస్సు 25 నెలలు), మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్క్ పరిధిలోని అడవిలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది.

సామాజిక మాధ్యమంలో ఒక పోస్టులో శ్రీ భూపేందర్ యాదవ్.. ఈ పరిణామాన్ని కునో జాతీయ పార్క్, దేశవ్యాప్త వన్యప్రాణి సంరక్షణ ప్రయత్నాల్లో ఒక 'కీలక ఘట్టంగా' అభివర్ణించారు. ఏడాదికి పైగా అడవిలో సహజ సిద్ధంగా జీవిస్తోన్న గామిని సంతతికి చెందిన ఈ ఆడ చిరుత.. సహజ వాతావరణ పరిస్థితులలో విజయవంతంగా నాలుగు పిల్లలకు జన్మనిచ్చిందని ఆయన పేర్కొన్నారు. 'చీతా పునరుద్ధరణ కార్యక్రమం'లో ఇది ఒక ప్రధాన ముందడుగు అని ఆయన వెల్లడించారు.

2022లో చీతా పునరుద్ధరణ ప్రారంభమైనప్పటి నుంచి అడవిలో సహజ సిద్ధంగా పిల్లలు జన్మించడం ఇదే మొదటిసారన్న కేంద్ర మంత్రి.. అందులో భారత్‌లో జన్మించిన ఆడ చిరుత పిల్లలకు జన్మనివ్వడం అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయమని ప్రముఖంగా పేర్కొన్నారు. దేశంలో సహజ వాతావరణ పరిస్థితులలో చిరుతలు మనుగడ సాగించడం, సంతానోత్పత్తిని నిర్ధారించడం వంటి ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలను చేరుకోవడంలో ఈ పరిణామం ఒక గొప్ప విజయమని ఆయన స్పష్టం చేశారు.

భారతదేశ పర్యావరణ పరిస్థితులకు చిరుతలు క్రమంగా అలవాటు పడుతున్నాయన్న విషయాన్ని ఈ పురోగతి తెలియజేస్తోందని శ్రీ భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. కునో జాతీయ పార్క్‌లో కొనసాగుతున్న నిరంతర సంరక్షణ చర్యలు, శాస్త్రీయ నిర్వహణ ప్రయత్నాల విజయానికి ఇది నిదర్శనమని ఆయన వెల్లడించారు.

చీతా సంరక్షణ కార్యక్రమంలో నిమగ్నమైన వన్యప్రాణి నిర్వాహకులు, పశు వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది కనబరుస్తున్న అంకితభావం, నిరంతర కృషిని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అభినందించారు. ఈ పరిణామాన్ని దేశానికే గర్వకారణమైన ఘట్టంగా ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# కేంద్రమంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారుల సమావేశం-2026..

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13: న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారుల సమావేశం-2026ను కేంద్ర మత్స్య శాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ పరిధిలోని మత్స్య విభాగం నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ (ఎంఎఫ్ఏహెచ్‌డీ), పంచాయతీరాజ్ శాఖ (ఎంఓపీఆర్) మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఎఫ్ఏహెచ్‌డీ, ఎంఓపీఆర్ శాఖ సహాయమంత్రి ప్రొఫెసర్ ఎస్.పీ. సింగ్ బఘేల్, ఎంఎఫ్ఏహెచ్‌డీ, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి శ్రీ జార్జ్ కురియన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమల భాగస్వాముల మధ్య నిర్మాణాత్మక చర్చలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ లభ్యత, ధరల ఒత్తిడి, నిబంధనల అమలు వంటి అంశాల్లో ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సవాళ్లపై అభిప్రాయాలను తెలుసుకోవటమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ద్వీపాలు, ఈఈజడ్ బహిరంగ సముద్రాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల పెంపు, మార్కెట్ విస్తరణ, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు.

సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులను పెంచటంలో ఎగుమతిదారులు చేస్తున్న కృషిని కేంద్రమంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, అమెరికా మినహా ఇతర మార్కెట్లలో కనబరిచిన అద్భుతమైన వృద్ధి వల్ల భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో పటిష్టమైన అభివృద్ధి నమోదైనట్లు ఆయన స్పష్టం చేశారు. నిరంతరాయంగా కొత్త మార్కెట్ల అన్వేషణ, ఉత్పత్తుల్లో వైవిధ్యాన్ని తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూనే.. యాంటీబయాటిక్స్ నిషేధాన్ని పాటించటం, ఉత్పత్తి మూలాలను గుర్తించే వ్యవస్థలను బలోపేతం చేయటం వంటి కఠినమైన నియంత్రణ నిబంధనలను పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈఈజడ్ నిబంధనలను ప్రస్తావిస్తూ.. యాక్సెస్ పాస్‌ల ద్వారా ఈ వ్యవస్థను అమల్లోకి తెస్తున్నామని, సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించటానికి సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అండమాన్, నికోబార్ దీవులు, ఈఈజడ్, అంతర్జాతీయ సముద్ర జలాల నుంచి లభించే ట్యూనా వంటి అత్యంత విలువైన చేప రకాల ఎగుమతి సామర్థ్యాన్ని ఆయన స్పష్టం చెప్పారు. చేపల వేట తర్వాత జరిగే నష్టాలను తగ్గించటానికి, ఎగుమతి వ్యవస్థను బలోపేతం చేయటానికి పడవల్లోనే వాటిని భద్రపరిచే విధానాలను మెరుగుపరచాలని, శీతలీకరణ వ్యవస్థలకు సంబంధించి పటిష్ఠమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని, మెరుగైన ప్యాకేజింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రత్యామ్నాయ మార్కెట్ల అన్వేషణ అవసరమని ఆయన పిలుపునిచ్చారు. లక్ష కోట్ల రూపాయల ఎగుమతి లక్ష్యాన్ని సాధించే దిశగా ఎగుమతిదారులు కృషి చేయాలని, బహిరంగ మార్కెట్ విధానాన్ని అవలంబించాలని కోరారు. ఇందుకోసం ఈఐసీ, ఎన్‌సీడీసీ, నాబార్డ్, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ వంటి సంస్థల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. అండమాన్, నికోబార్ దీవుల్లో నిర్వహించిన పెట్టుబడిదారుల సమావేశం గురించి కూడా ప్రస్తావించారు. ఈ సమావేశం ద్వారా సముద్రంలో పంజరపు పెంపకం, ముత్యాల సాగు, లోతైన సముద్ర ప్రాంతాల్లో చేపల వేటకు ఉపయోగించే నౌకల వంటి వాటిల్లో పెట్టుబడులు పెరిగాయని, ఇవి మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆయన చెప్పారు.

మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయమంత్రి శ్రీ జార్జ్ కురియన్ మాట్లాడుతూ.. బడ్జెట్ అనంతర వెబినార్-2026 లక్ష్యాలకు అనుగుణంగా మత్స్య రంగాన్ని అత్యంత విలువైనదిగా, అధిక డిమాండ్ గల రంగంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో కనిపిస్తున్న ప్రోత్సాహకరమైన వృద్ధిని ప్రస్తావిస్తూ.. ఎగుమతిదారులు చేస్తున్న నిరంతర ప్రయత్నాలను అభినందించారు. ఎగుమతుల వృద్ధిని నిలబెట్టుకోవటానికి ఉత్పత్తి మూలాలను గుర్తించటం, నాణ్యత ధ్రువీకరణలతో కఠినమైన నిబంధనల అమలు, పటిష్టమైన రవాణా వ్యవస్థ, విలువ వ్యవస్థ అభివృద్ధి అత్యంత ఆవశ్యకమని వ్యాఖ్యానించారు. కేంద్ర మత్స్య విభాగ కార్య దర్శి అభిలక్ష్ లిఖీ ప్రసంగిస్తూ.. ఎంపీఈడీఏ, ఈఐసీ, వాణిజ్య శాఖల సమన్వయంతో విభిన్న మార్కెట్ విస్తరణ వ్యూహాన్ని రూపొందించినట్లు తెలిపారు. దాదాపు నలభై దేశాల రాయబారులతో జరిపిన దౌత్యపరమైన చర్చలు ప్రోత్సాహకరమైన ఫలితాలను ఇచ్చాయని ఆయన స్పష్టం చెప్పారు. మార్కెట్ విస్తరణతో పాటుగా, తినటానికి, వండటానికి సిద్ధంగా ఉండే, విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని తెలిపారు. సముద్ర ఆహార ఎగుమతులను ప్రోత్సహించటానికి ఎగుమతిదారులకు, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలకు మధ్య నేరుగా సంబంధాలను ఏర్పరచటానికి మత్స్య శాఖ సహకరిస్తుందని తెలిపారు. ఎగుమతిదారులకు మద్దతు ఇవ్వటానికి, నాణ్యతా ప్రమాణాలు, పోటీతత్వం, ఎగుమతి సంసిద్ధతను మెరుగుపరచటానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేయాలని ఎంపీఈడీఏను కోరారు. సమావేశంలో పాల్గొన్న వాటాదారులు భారత ప్రభుత్వ క్రియాశీల మద్దతును అభినందించారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులను పెంచటంలోని ప్రధాన సవాళ్లను, అవకాశాలను వివరించారు. ముఖ్యంగా చేపల వేట ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను సరళతరం చేయాలని.. అండమాన్, నికోబార్ దీవుల్లో కప్పాఫైకస్ రకపు సముద్రపు పాచి సాగుకు అనుమతులను సులభతరం చేయాలని కోరారు. శాస్త్రీయ పద్ధతిలో నాణ్యమైన చేపల మేతను తయారు చేసేందుకు ఫిష్-మీల్ తయారీదారులకు ప్రత్యేక మద్దతును అందించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ తీరంలో మంచినీటి మత్స్య సాగు, సముద్ర సాగు ఎగుమతి సామర్థ్యాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఎగుమతులపై ప్రభావం చూపే ఇతర సవాళ్లపైనా దృష్టి సారించారు. వీటిలో ప్రధానంగా సుంకాలు, మార్కెట్ ప్రవేశంలో ఆటంకాలు, అధిక నిర్వహణ ఖర్చులు, వాల్యూ-యాడెడ్ ప్రాసెసింగ్ సామర్థ్య లోపాలు, శీతలీకరణ వ్యవస్థలు రవాణా ఇబ్బందులున్నాయి. వీటన్నింటితో పాటు మూలాలను గుర్తించి, ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని వారు సూచించారు.

ఈ సమావేశానికి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి అథారిటీ (ఎంపీఈడీఏ), జాతీయ మత్స్య సంపద అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ), ఎక్స్‌పోర్టు ఇన్‌స్పెక్షన్ కౌన్సిల్ (ఈఐసీ), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్), నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ), నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్సు లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్), ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఓఎఫ్‌పీఐ), ఇతర సంబంధిత మంత్రిత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. వీరితో పాటు సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ మెరైన్ ఇంగ్రీడియంట్స్ అసోసియేషన్, సీవీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వంటి ఎగుమతిదారుల సంఘాల ప్రతినిధులు.. సీ6 ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, సాషిమి ఫుడ్స్, ఆక్వాగ్రి ప్రాసెసింగ్, అనేమ్కో, ఓషియానిక్ హారిజన్ వంటి పరిశ్రమల ప్రతినిధులు, వివిధ సహకార సంఘాలు, ఎగుమతిదారులు పాల్గొన్నారు. భారత ప్రభుత్వ మత్స్య విభాగ సీనియర్ అధికారులతో పాటు ఒడిశా, గుజరాత్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ, గోవా, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ మత్స్య శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు గత 11 ఏళ్లలో సగటున 7 శాతం వార్షిక వృద్ధి రేటుతో స్థిరమైన, బలమైన వృద్ధిని నమోదు చేశాయి. ఈ సమయంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు రెట్టింపునకు పైగా పెరిగాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ. 30,213 కోట్లుగా ఉన్న ఎగుమతులు, 2024-25 నాటికి రూ. 62,408 కోట్లకు చేరాయి. ఇందులో ప్రధానంగా రూ. 43,334 కోట్ల విలువైన రొయ్యల ఎగుమతులు కీలకమైనవి. భారతదేశపు సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతులు ఎంతో వైవిధ్యమైనవి. సుమారు 350కి పైగా రకాల ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 130 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతి విలువలో 36.42శాతం వాటాతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, యూరోపియన్ యూనియన్, ఆగ్నేయాసియా, జపాన్, మధ్యప్రాచ్య దేశాలు, మిగిలిన మార్కెట్లతో కలిపి సుమారు 9 శాతం వాటాతో ఉన్నాయి.

# మహాత్మా జ్యోతిబా ఫూలే 200వ జయంతి నేపథ్యంలో ఏప్రిల్ 11 నుంచి 2028 ఏప్రిల్ 11 వరకు దేశవ్యాప్తంగా రెండేళ్ల వేడులకు కేంద్ర ప్రభుత్వ శ్రీకారం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 13:స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2025 ఆగస్టు 15నాటి ప్రసంగంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ: "మహనీయుడైన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా ఫూలే 200వ జయంతి వేడుకలను మనం త్వరలో నిర్వహించుకోబోతున్నాం. ఆయన ప్రబోధించిన ఆదర్శాలు, సూత్రాలు నేటికీ మనకెంతో స్ఫూర్తిదాయకాలు... ముఖ్యంగా 'వెనుకబడిన వారికి ప్రాధాన్యం' అన్నది ఒక తారక మంత్రం. తద్వారా సామాజిక పరిణామంలో ఉన్నత శిఖరారోహణకు శాయశక్తులా కృషి చేయాలని మేం నిర్ణయించాం. ఈ మేరకు పారదర్శక విధానాలతో 'వెనుకబడిన వారికి ప్రాధాన్యం' నినాదానికి క్షేత్రస్థాయిలో వాస్తవ రూపమిచ్చి వారి జీవనంలో నవ్య కాంతులు నింపాలని ఆకాంక్షిస్తున్నాం" అని ప్రకటించారు.

ప్రధానమంత్రి ప్రకటన స్ఫూర్తితో మహాత్మా జ్యోతిబా ఫూలే 200వ జయంతి ఉత్సవాలను ఈ నెల 11 నుంచి దేశవ్యాప్తంగా 2028 ఏప్రిల్ 11 వరకూ రెండేళ్ల పాటు కొనసాగించాలని నిశ్చయించిన కేంద్ర ప్రభుత్వం ఇవాళ అందుకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన 'జాతీయ అమలు కమిటీ' (ఎన్ఐసీ), ఈ నెల 6న ఉత్సవాల నిర్వహణకు ఆమోదముద్ర వేసింది.

తదనుగుణంగా సామాజిక న్యాయం-సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన "ఫూలే అక్రాస్ ఇండియా" పేరిట అంతర్రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్య కార్యక్రమం కింద న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రం (డీఏఐసీ)లో ఇవాళ వేడుకలను ఘనంగా ప్రారంభించింది. దీంతో రెండేళ్లపాటు కొనసాగే ఈ వేడుకలు నేటినుంచి లాంఛనంగా ప్రారంభమయ్యాయి. మహాత్మా జ్యోతిబా ఫూలే జీవితం, సిద్ధాంతాలు, సామాజిక సంస్కరణోద్యమాల స్ఫూర్తితో ముందడుగు వేసిన ప్రాంతాల వారీ నేపథ్య ప్రదర్శనల ద్వారా దేశ వైవిధ్యాన్ని చాటే 'జాతీయ సాంస్కృతిక సంగమం' తరహాలో ఈ కార్యక్రమాన్ని రూపొం దించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండేళ్లపాటు సాగే ఈ సంస్మరణోత్సవాల లాంఛన సూచికగా ప్రత్యేకంగా రూపొందించిన ఒక ప్రకటన చిత్రాన్ని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రజల ముందుకు తెచ్చింది. సామాజిక న్యాయం, విద్య, మహిళా సాధికారత, సమానత్వం దిశగా మహాత్మా ఫూలే చిరస్మరణీయ సేవలను ఈ చిత్రం ప్రస్ఫుటం చేస్తుంది. అలాగే, సంస్మరణ కార్యక్రమాల నిర్వహణలో దేశవ్యాప్త భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తుంది.

జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సంస్కరణోత్సవాల మార్గ నిర్దేశం, పర్యవేక్షణ కోసం గౌరవనీయ భారత ప్రధానమంత్రి అధ్యక్షతన 126 మంది సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో మాజీ రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, ముఖ్య మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ఆధ్యాత్మిక నాయకులు, సాంస్కృతిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు సహా అనేకమంది ప్రముఖులున్నారు. ప్రభుత్వం, సమాజం ఏకోన్ముఖ భాగస్వామ్యంతో ముందంజ వేసే విధానాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

సంస్మరణోత్సవాల రూపకల్పన-అమలుకు సంబంధించి ఈ కమిటీ విధానపరమైన దిశా నిర్దేశం సహా మార్గదర్శకత్వం వహిస్తుంది. ఈ మేరకు విధానాలు, ప్రణాళికలు, కార్యక్రమాలను ఆమోదించడమే కాకుండా స్మారక కార్యక్రమాలకు పర్యవేక్షణ, మార్గనిర్దేశం చేస్తుంది. వేడుకల నిర్వహణకు తగిన విస్తృత చట్రం, కాలపరిమితులను నిర్ణయిస్తుంది.

కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, పౌర సమాజం భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు, కార్యకలాపాల ద్వారా ఈ సంస్మరణోత్సవాన్ని నిర్వహిస్తారు. మహాత్మా జ్యోతిబా ఫూలే జీవితం, ఆలోచనలు, శాశ్వత వారసత్వ వ్యాప్తి లక్ష్యంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, సెమినార్లు, యువత భాగస్వామ్య కార్యక్రమాలు, విద్యాపరమైన చర్చలు, విస్తృత ప్రచార కార్యక్రమాలు ఈ వేడుకలలో అంతర్భాగంగా ఉంటాయి.

మహాత్మా జ్యోతిబా ఫూలే (1827?1890) ఒక దార్శనిక సంఘ సంస్కర్త. అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్య-సామాజిక సమానత్వ సాధనకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. ముఖ్యంగా మహిళలపై సామాజిక వివక్షను సవాలు చేస్తూ వారిని విద్యాభ్యాసం వైపు ప్రోత్సహించారు. అలాగే అందరికీ సమ న్యాయం కోసం ఆయన సాగించిన అవిరళ కృషి దేశంలో ప్రగతిశీల సామాజిక సంస్కరణోద్యమాలకు బాటలు వేసింది.

ఈ నేపథ్యంలో ఆయన వారసత్వాన్ని సముచిత రీతిలో స్మరించుకోవడం సహా సమానత్వం, విద్య, సామాజిక న్యాయం వంటి ఆయన ఆదర్శాలను కొనసాగించడంలో పౌరులకు... ముఖ్యంగా యువతకు ఉత్తేజమిచ్చేలా ఈ సంస్మరణోత్సవాలు రెండేళ్ల పాటు కొనసాగుతాయి.

## 'కార్మిక శక్తి ఏంటో ఐటీసీ యాజమాన్యానికి చూపుతాం'

ఖమ్మం, ఏప్రిల్ 13: కార్మికుల శక్తి ఏమిటో తమ పోరాటం ద్వారా ఐటీసీ యాజమాన్యానికి చూపిస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్‌పాషా హెచ్చరించారు. సోమవారం 19వ రోజు దీక్షా శిబిరాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి, బీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ బాధ్యులు సదానందం సందర్శించి దీక్షల్లో కూర్చున్న కాంట్రాక్టు కార్మికులు సందిపాము బాబు, దార్ల కవిత, ముష్టికుంట వెంకటరమణ, వట్టం కవిత, కడబోయిన చంద్రకళ, మేకల రమేశ్‌కు సంఘీభావం ప్రకటించారు.

ఇప్పటికే 18 రోజులుగా జరుగుతున్న రిలే దీక్షలకు పలు పార్టీల నాయకులు, మాజీ ప్రతినిధులతో పాటు కార్మిక సంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుండటంతో జేఏసీ నాయకులు రెట్టించిన ఉత్సాహంలో పోరాటాన్ని ముందుకు సాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎండను సైతం లెక్కచేయకుండా 19 రోజులుగా దీక్షలు చేస్తున్న కార్మికులను ఐటీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో తాము కార్మికులకు అండగా ఉంటామన్నారు. 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ సమస్యలు పరిష్కారం కాకుండానే కాలం ముగిసిపోయిందన్నారు.

# తెలంగాణ గర్వకారణం... దేశంలోనే అత్యున్నత అంబేద్కర్ విగ్రహం

గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరణ జరిగి మూడేళ్లు గడిచాయి. భారాస వ్యవస్థాపక అధినేత, గత

ప్రభుత్వాధినేత కేసీఆర్ చేతుల మీదుగా అంబేద్కర్ జన్మదినమైన ఏప్రిల్ 14న 2023న విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది.

ఈ విగ్రహం భారత దేశంలోనే అత్యున్నత అంబేద్కర్ విగ్రహం కావడం తెలంగాణకే గర్వకారణం. దేశ చరిత్రను ఆవిష్కరించిన మహాపురుషుల్లో డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ పేరు శాశ్వతంగా మెరిసి పోతుంది. ఆయన దళితులకు, సామాజికంగా బలహీన వర్గాలకు ప్రతినిధిగా కాకుండా, భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప పురుషుడిగా, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. అటువంటి మహానేతకు అర్థమైన స్థాయిలో నివాళి అర్పిస్తూ తెలంగాణ రాష్ట్రం నిర్మించిన 125 అడుగుల విగ్రహం దేశానికే కాదు, ప్రపంచానికే గొప్ప సందేశాన్ని అందించింది.

భారత రాజ్యాంగ నిర్మాత, విద్యాధికుడు, తత్వవేత్త, సంపాదకుడు, విప్లవకారుడు, దార్శనికుడు, చరిత్రకారుడు, ప్రాసంగికుడు, రచయిత, దళిత జన బాంధవుడు, అర్థ శాస్త్రజ్ఞుడు, స్వతంత్ర భారత తొలి న్యాయ శాఖ అమాత్యులు, న్యాయవాది, బౌద్ధ ధర్మ పునరుద్ధారకుడు, భారతరత్న డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ విగ్రహాన్ని

హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్ తీరంలో ఎన్టీఆర్ గార్డెన్ కు ఆనుకుని ఉన్న స్థలంలో ఏర్పాటు చేశారు. దేశంలో ఇప్పటి వరకు ఉన్న అంబేద్కర్ విగ్రహాల్లో ఇదే ఎత్తైనది. పార్లమెంటు ఆకారంలో 50 అడుగుల పీఠాన్ని నిర్మించి, దాని పైన అంబేద్కర్ లోహ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 11.80 ఎకరాల స్థలాన్ని దీనికోసం కేటాయించారు.

125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం 2016 ఏప్రిల్ 14న శంకుస్థాపన గావించారు. పద్మభూషణ్ రామ్ వంజి సుతార్ విగ్రహ రూప శిల్పిగా, దేశం లోనే అతి ఎత్తైన అంబేద్కర్ విగ్రహం 2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేశారు. విగ్రహ



ప్రతిష్టాత్మకం... అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనం భారత రాజ్యాంగ నిర్మాతకు అజరామర నివాళి

నిర్మాణం వెనుక ఉన్న శిల్పకళ, సాంకేతిక నైపుణ్యం ఎంతగానో ప్రశంసనీయం.

బేస్‌మెంట్ ఎత్తు 50 అడుగులు, వెడల్పు 45.5 అడుగులు, వినియోగించిన స్టీల్ 791 టన్నులు, ఇత్తడి 96 మెట్రిక్ టన్నులు, మొత్తం వ్యయం రూ.146 కోట్లతో 425మంది శ్రామికులు పని చేశారు.

36 ఎకరాల్లో అంబేద్కర్ స్మృతి వనంలో రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, మెయిన్ ఎంట్రెన్స్, వాటర్ ఫౌంటేన్, సాండ్ స్టోన్ వర్క్, జిఆర్‌సి, గ్రానైట్ ఫ్లోరింగ్, లిఫ్ట్ ఏర్పాటు చేశారు. సందర్శకులకు అంబేద్కర్ జీవిత తత్వాన్ని, విలువలను మరింత సజీవంగా అనుభవించేందుకు అవకాశం కల్పిస్తాయి. నాడు ఏప్రిల్ 14నాటి విగ్రహా విష్కరణ కార్యక్రమం కోసం రూ. 10 కోట్లను నాటి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్, నాటి బీఆర్ఎస్ ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు అయినారు.

అంబేద్కర్ విగ్రహం కేవలం ఒక శిల్పం కాదు? ఇది భారత సమాజంలో సమానత్వం, న్యాయం, స్వాతంత్ర్య భావాల్ని ప్రతిబింబించే ఒక భావోద్వేగ నిర్మాణం. అంబేద్కర్ గారి తత్వచింతన, రాజ్యాంగ రచన, దళిత సంక్షేమానికి ఆయన చేసిన పోరాటాలన్నింటినీ ఈ విగ్రహం సజీవంగా గుర్తు చేస్తుంది. ఇది భారత ప్రజాస్వామ్యానికి, హక్కుల సాధనకు నిలిచిన ఒక స్ఫూర్తిదాయక చిహ్నం. తెలంగాణ రాష్ట్ర గత ప్రభుత్వం నిర్మించిన అంబేద్కర్ విగ్రహం కేవలం నిర్మాణంలోనే కాదు, ఆలోచనల్లోనూ, తత్వంలోనూ గొప్పది. ఇది తరతరాలకు స్ఫూర్తిగా నిలిచి, దేశవ్యాప్తంగా అంబేద్కర్ సందేశాన్ని విస్తరించేదిగా నిలవనుంది. ఇది తెలుగువాళ్ళకే కాదు, భారతదేశానికే గర్వకారణం.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

---

# దశాబ్దాల నిరీక్షణకు విముక్తి కల్పించి , మహిళలకు పట్టంకట్టి పట్టాభిషేకం చేస్తుంది మోదీ ప్రభుత్వం.

## -..మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ లు చారిత్రక నిర్ణయం

## -బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ





కరీంనగర్, ఏప్రిల్ 13:(నేటినిజం ప్రతినిధి) భారత దేశ రాజకీయాలలో మహిళా భాగా,స్వామ్యాన్ని పెంచే మహత్తర సంస్కరణకు సమయం ఆసన్నమైందని, దశాబ్దాల నిరీక్షణకు విముక్తి కల్పిస్తూ మహిళలకు పట్టం కట్టి పట్టాభిషేకం చేసే కార్యక్రమానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు , కార్పొరేటర్ చొప్పరి జయ శ్రీ అన్నారు. సోమవారం కరీంనగర్ లోని పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో చొప్పరి జై శ్రీ మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారి శక్తి వందన్ అధి నియం బిల్లును ఏప్రిల్ 16న పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. మహిళలకు 33 శాతం చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు.గత కాంగ్రెస్ పార్టీ మహిళలను రాజకీయ అవసరాలకే వాడుకుందని, మహిళలకు కాంగ్రెస్ రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించ డానికి ఏ నాడు ఆలోచన చేసిన పాపాన పోలేదన్నారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ మహిళలకు చట్టసభల్లో హక్కులు కల్పించలేక పోయిందని , భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంమాత్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టి ఒక నూతన ఒరవడికి మార్గం చూపిందన్నారు. దీంతో మహిళలు నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశం ఉందని తెలిపాం ం. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం ఎంతో చిత్తశుద్ధి తో పనిచేస్తుందన్నారు. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కూడా కీలకంగా మారిందని , ఆదిశలోనే మోడీ సర్కార్ దశాబ్ద కాలాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని , చేతల ప్రభుత్వమని విశ్వాసం మహిళల్లోకి బలంగా వెళ్ళిందన్నారు. 2029 ఎన్నికల లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యం తో, భారీ ఎత్తున చట్టసభలలో అవకాశం కల్పించాలనే సంకల్పంతో బిజెపి ప్రభుత్వం ముందు కొనసాగుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మహిళలు ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో శక్తివంతమైనప్పుడే అది సాధ్యమవుతుందని మోడీ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుంద న్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ల నిర్ణయం నిజంగా విప్లవాత్మక అడుగు, ఇది చట్టం మాత్రమే కాదు కోట్లాది ఆడబిడ్డల ఆకాంక్షల కు ప్రతిరూపం లాంటిదన్నారు.ఎస్సీ ఎస్టీలకు కూడా ఈ చట్టంలో రిజర్వేషన్లు అమలయ్యేలా ఇది రూపకల్పన చేయబడిందని, ఈ చట్టంతో గ్రామీణ మహిళలకు కూడా ఎమ్మెల్యేలు ఎంపీలు అయ్యే అవకాశాన్ని అందిస్తుందన్నారు. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరంమహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడి విధంగా 12 కోట్లకు పైగా స్వచ్ఛ టాయిలెట్లు, 9 కోట్లకు పైగా ఉజ్వల ఎల్పిజి ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆవాస్ యోజన ద్వారా మహిళల పేరు మీదుగా ఇల్లు రిజిస్ట్రేషన్లు, బేటి బచావో బేటి పడావో , ఖేలో ఇండియా లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కుతుందని , 33 శాతం బిల్లు అమలుతో ప్రధాని మోదీ చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని కరీంనగర్లోని మహిళలంతా పార్టీలకతీతంగా కలిసి వచ్చి దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి మద్దతు తెలియజేయాలని , ఆ దిశలో ఏప్రిల్ 15న కరీంనగర్లో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీకి అందరూ తరలి రావాలని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేశ శిల్ప, గొట్టిముక్కుల ఉమారాణి, పెద్దపల్లి శ్రీలేఖ, కర్రె పద్మ ఎన్నమ్ లక్ష్మి, దేవసాని సరస్వతి, పొన్నం లక్ష్మి, మామిడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎస్ఐ మునుగోటి రవీందర్

నల్గొండ, ఏప్రిల్ 13:వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్యాలమ్మగూడెం, పిట్టంపల్లి, భాన్కర్లబాయి, గ్రామంలో (అరైవ్-అలైవ్) కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై యువత, డ్రైవర్లు, గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ మాట్లాడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రాంగ్ రూట్లో ప్రయాణించడం ప్రాణాంతకమని, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పుష్పలత, ఎంఈఓ అంబటి అంజయ్య, స్థానిక సర్పంచ్ సుంకరబోయిన సంధ్యా వెంకన్న, ఏఎస్ఐ నాయిని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీ సోయినేని నర్సయ్యకు నివాళులు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13:(నేటినిజం ప్రతినిధి ): వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సోయినేని నర్సయ్య మరణం పట్ల స్థానికంగా విషాదం నెలకొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, గోస్కుల రవి, వెంకట రెడ్డి, మల్లేశం, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు నర్సయ్య భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.

# మైనార్టీ విద్యాలయం విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13:(నేటినిజం ప్రతినిధి ): ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని మైనారిటీ విద్యాలయాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, తంగళ్ళపల్లి, వేములవాడ లోని మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. ద్వితీయ సంవత్సరం బీపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు, సుబియ తబస్సుం 969 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో బుష్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు కే.నమిత 979 మార్కులు సాధించి తమ ప్రతిభ చూపారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంఎల్ టీ విభాగంలో 500 మార్కులకు గాను సీ హెచ్. మనోజ్, కే.నిరంజన్ 488 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు. బి.సుకుమార్ 481 మార్కులు సాధించారు. ఎల్ ఎం అండ్ డీటీ విభాగంలో 500 మార్కులకు గాను ఎన్ ప్రణయ్ 491 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును సాధించారు ఇ.రాహుల్ 490 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకును సాధించారు. డీ రామ్ చరణ్ 488 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకును సాధించారు అలాగే ద్వితియ సంవత్సరం ఎం ఎల్ టీ విభాగంలో 1000 మార్కులకు యు.హేమంత్ గాను 982 మార్కులు, ఎండీ శాదుల్ 973 మార్కులు ఎల్ మునీందర్ 967 మార్కులు సాధించారు. ఎల్ ఎం అండ్ డీటీ విభాగంలో 1000 మార్కులకు గాను ఎస్.కే ఆదిల్ 977 మార్కులు, జే అభిషేక్ 959 మార్కులు, పీ రాజు 924 మార్కులు సాధించి ప్రతిభ చూపారు.కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని ఎం.ఎ.భారతి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉరుస ఫాతిమా, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలి

## జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్- వాహనదారులతో ప్రతిజ్ఞ



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13:(నేటినిజం ప్రతినిధి ): రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆఫీసులో సోమవారం ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వాహనదారులందరూ భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, నిదానంగా ప్రయాణించడం, రోడ్డు భద్రత సూచనలు పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు.. ప్రమాద రహిత సమాజం కోసం కృషి చేయాలని లక్ష్మణ్ కోరారు. ప్రాణాలు అమూల్యమైనవని, ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగవని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆఫీసుకు వచ్చిన వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ పృథ్వీరాజ్ వర్మ, రవాణా శాఖ సిబ్బంది కల్పన, రమ్య, సౌమ్య పాల్గొన్నారు.

# సంపూర్ణ పోషణతోనే స్త్రీ, శిషు వికాసం

## -ఐసీడీఎస్ ఇంచార్జి సీడీపీఓ చంద్రకళ

మెదక్, ఏప్రిల్ 13:సంపూర్ణ పౌష్టికాహారంతోనే స్త్రీ, శిషు, చిన్నారుల ఆరోగ్య వికాసం ఉంటుందని దుబ్బాక ఐసీడీఎస్ ఇంచార్జి సీడీపీఓ చంద్రకళ తెలిపారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేటలో గ్రామ స్థాయి పోషణ పక్షం కార్యక్రమంలో సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఏప్రిల్ 9 నుండి 23 వరకు జరుగుతున్న పోషణ పక్షం షెడ్యూల్‌లో భాగంగా గ్రామం లోని మొదటి అంగన్ వాడీ కేంద్రంలో గ్రామ స్థాయి పోషణ పక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల ఆహారం అవసరం, రోజువారీ జీవన విధానంలో పోషకాహారం పాత్ర గురించి వివరించారు. అదేవిధంగా వంటకాల ప్రదర్శనలు నిర్వహించి, సులభంగా లభ్యమయ్యే పదార్థాలతో ఆరోగ్యకరమైన ఆహారం తయారీ విధానాలను చూపించారు.

ముఖ్యంగా గర్భం దాల్చిన రోజు నుండి బిడ్డ పుట్టిన తర్వాత రెండేళ్ల వరకు ఉన్న మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ దశలో తల్లి, శిశువుకు సరైన పోషణ ఎంతో కీలకమని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందించే అదనపు సంపూర్ణ భోజనాన్ని ప్రతి అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన కార్య క్రమాలు నిర్వహిం చారు.. చివరగా, అందరూ కలిసి పోషణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుభా షిణి, పంచాయతీ సెక్రెటరీ రవీందర్, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్, రిలయన్స్ కోఆర్డినేటర్ భాస్కర్, సెక్టార్ సూపర్వైజర్ ప్రతిభ, ఏఎన్ఎం లక్ష్మి, వార్డు సభ్యులు శ్యామల, భాను, శ్రీనివాస్, లలిత, జహం గీర్, వెంకటేశం, అంగన్వాడీ టీచర్లు వీణ, స్వప్న, జ్యోతి, ఆశ కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో టీజీఎంఆర్ఎస్ మైనార్టీ విద్యార్థుల ప్రతిభ



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 13:(నేటినిజం ప్రతినిధి ): తంగళ్ళపల్లి మండలంలోని టీజీఎంఆర్ఎస్ మైనార్టీ పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అత్యుత్తమ ఫలితాలు సాధించడం గమనార్హం.ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బి.శిరీష 470లో 439 మార్కులు సాధించగా, బైపీసీలో బి.సాక్షి 440లో 429 మార్కులతో టాప్‌గా నిలిచారు. ద్వితీయ సంవత్సరం బైపీసి ఎం నందిని 1000లో 977 మార్కులు, ఎంపీసీలో బుష్ర కౌసర్ 1000లో 985 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ ఉరుస ఫాతిమా తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com